www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 15 ఆగస్టు 2024 | 16 పేజీలు



వైఎస్ఆర్



అన్నమయ్య

రోడ్లు, డ్రెయినేజీ సమస్యల

పరిష్కారానికి చర్యలు

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణాన్ని పూర్తిస్థాయిలో అభివద్ధి చేసేందుకు రోడ్లు, డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతామని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మంత్రి రాంప్రసాద్ రెడ్డి పట్టణంలోని వివిధ ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో రాయచోటి పట్టణాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతామని చెప్పారు. ఇందుకు పట్టణంలోని అధికారులు ప్రజలు ప్రజా ప్రతినిధులు ప్రతి ఒక్కరూ సహకరించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు



ధ్వంసమైన దహదారిని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సహకరించాలన్నారు. పట్టణంలో ప్రజలు రోడ్లు, డ్రెయినేజీ సమస్యలతో ఎన్నో ఇబ్బందులు పడేవారని, నేడు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రాధాన్యత క్రమంలో అభివద్ధి పనులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. గతంలో డ్రెయినేజీ సమస్య వల్ల మురికి నీరు రోడ్డుపైకి వచ్చి ప్రజలు

2లో

రోడ్లు, డ్రెయినేజీ సమస్యల..

(మొదటిపేజీ తరువాయి) మలేరియా, డెంగీ జ్వరాలకు గురయ్యావారని ప్రస్తుతం మున్సిపాలిటీ అధికారులతో చర్చించి డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరమైన చోట సిమెంట్ రోడ్లు వేసేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్ర మంలో పలు సమస్యలు ప్రజలు మంత్రికి తెలిపారు. అనంతరం గాంధీబజార్ లోని అమ్మ వారిశాల శ్రీ కన్యకా పరమేశ్వరి నూతన దేవాలయాన్ని పరిశీలించారు. గాంధీ బజార్ అభివద్ధికి చర్యలు చేపడతామన్నారు.

శిబ్యాల హౌసింగ్ కాలనీకి నీటి సమస్య పరిష్కారం

రాయచోటి మండలంలోని శిబ్యాల గ్రామంలోని హౌసింగ్ కాలనీకి గతంలో ఉన్న బోరుకు నూతన మోటర్ బిగించి హౌసింగ్ కాలనీకి స్విచ్ ఆన్ చేసి నీరు వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రత్యేకతలు చేపడుతున్నామన్నారు. నీటి సమస్య పరిష్కారానికి ఇప్పటికే దాదాపు 18 నూతన బోర్లు వేయించామన్నారు.



ఫెలోషిప్ అందజేస్తున్న విసి కృష్ణారెడ్డి

జర్మన్ ఫెలోషిప్‌కు డాక్టర్ వాసుగోవర్ధన్‌రెడ్డి ఎంపిక

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం కెమిస్ట్రీ విభాగ అధ్యాపకులు డాక్టర్ వాసుగోవర్ధనరెడ్డి ప్రతిష్టాత్మక అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ రిన్యూడ్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఇది జర్మనీలోని అలెగ్జాండర్ వాన్ హంబోల్ట్ ఫౌండేషన్ పరిశోధకులకు అందించే అత్యంత గౌరవం. ఈ ఫెలోషిప్ కోసం డాక్టర్ రెడ్డి తన పరిశోధన సమాచారాన్ని జతచేస్తూ ఈ ఏడాది మేలో దరఖాస్తు చేశారు. ఈనెల 12న అవార్డును ప్రకటిస్తూ అధికారిక నోటిఫికేషన్‌ను డాక్టర్ వాసు గోవర్ధన్ రెడ్డి చిరునామాకు వారు పంపారు. ఈ ఫెలోషిప్ వలన అతనికి మూడు నెలల పాటు ప్రఖ్యాత జర్మన్ సంస్థలో పరిశోధన చేసే అవకాశాన్ని అందిస్తుంది. వచ్చే ఏడాది మే 1 నుంచి జులై 31వ తేదీ వరకు ఆ దేశంలో పరిశోధన చేసేందుకు ఆహ్వానించింది. ఈయనకు మూడు నెలల కాలంలో నెలకు దాదాపు 3000 యూరోల నెలవారీ స్టైఫండ్‌ను అందజేస్తారు. ఫెలోషిప్ ఎంపికైన డాక్టర్ వాసు గోవర్ధన్‌రెడ్డిని యోగి వేమన యూనివర్శిటీలోని వైస్ ఛాన్సలర్ కె.కష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాధ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య పి.పద్మ, పలువురు అధ్యాపకులు అభినందించారు. ఉన్నతమైన గుర్తింపుతో విశ్వవిద్యాలయ కీర్తిని పెంచారని ప్రశంసించారు.

నారాయణ స్కూల్‌లో ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు

ప్రజాశక్తి - కడప

స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న నారాయణ స్కూల్లో విద్యార్థులకు ఫ్యాన్సీ డ్రెస్ పోటీల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ప్రిన్సిపల్ గీత ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పిల్లలు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎజిఎం శ్రీనివాసులు, ఆర్ఐ కిరణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఒక్క నారాయణ విద్యాసంస్థల్లోనే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని పెంచడానికి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.



ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్‌లో పాల్గొన్న స్కూల్ విద్యార్థులు

గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా పనిచేయాలి

అవినీతికి ఆస్కారం లేకుండా చేయాలి

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వాలు పనిచేయాలి

స్వాతంత్ర్య సమరయోధులు పెడబల్లె బాల యల్లారెడ్డి

గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ప్రస్తుత ప్రభుత్వాలు అడుగు వేసినప్పడే దేశం అభివృద్ధి దిశగా పయనిస్తుందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా పనిచేయాలని, అప్పుడే గ్రామాలలోని ప్రజలు స్వేచ్ఛాయుతంగా పచ్చని పంటలతో, పశుసంపదతో చల్లగా ఉంటారని 103 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధులు పెడబల్లే బాలయల్లారెడ్డి అభిప్రాయపడ్డారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో తెల్లదొరలకు వ్యతిరేకంగా పోరాడి దేశం కోసం తనవంతు కృషి చేశారు. అప్పట్లో దేశంపై అభిమానంతో స్వాతంత్ర్యం కోసం తాను బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాటం చేసి జైలు జీవితం గడిపారు. గత జ్ఞాపకాలతోపాటు ఇప్పడున్న ప్రభుత్వాలు ప్రజల కోసం ఎలా పనిచేయాలి, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలి అనే విషయాలు 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రజాశక్తికి వివరించారు..

ప్రజాశక్తి-చెన్నూరు

78 ఏళ్ల స్వతంత్ర భారతావనిలో నేటికీ పేదరికం పెళ్లబుకుతోందని, దీనిని అధిగమించాలంటే గాంధీజీ కలలు కన్నా గ్రామ స్వరాజ్యంతోనే సాధ్యమని ఆయన అన్నారు, ఇప్పటికే ప్రభుత్వాలు పేదరిక నిర్మూలనకు ఎన్నో పథకాలు తీసుకురావడం జరిగిందని ఆయన తెలిపారు, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు సూపర్ సిక్స్ పథకాలు తీసుకురావడం సంతోషకరమన్నారు, ఈ పథకాలు పేదరిక నిర్మూలనకు ఎంతో దోహదపడతాయని భావిస్తున్నట్లు ఆయన తెలిపారు,

103 ఏళ్లలో కూడా ఇంకా తన పనులు తాను చేసుకుంటున్నానని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో దేశం పైన ప్రేమతో తెల్ల దొరలపై తాము చేసిన పోరాటాలతో జైలు శిక్ష అనుభవించామని చెప్పారు. ఆరోజుల్లో తెల్ల దొరల ఆగడాలకు హద్దే లేదని, వారి ఆగడాలు అరికట్టడంలో యువకుడిగా తన వంతు పాత్ర పోషించడం జరిగిందని ఆయన తెలిపారు, భరతమాత పై ఉన్న అపారమైన ప్రేమతో, భక్తితో ఆప్పుడు యువకులమైన తాము సమయతమై చెన్నూరు- కొండపేట మధ్య ఉన్న పెన్నా నదిలో లెవెల్ కాజ్‌వేను తెల్లదొరలు దాటకుండా



పగలగొట్టడం జరిగిందన్నారు. దీంతో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం తమపై కేసు నమోదు చేసి జైల్లో ఉంచిందని పేర్కొన్నారు. జిల్లాలో స్వతంత్ర సమరయోధులలో తానొక్కడినే బతికి ఉన్నానని చెప్పారు. ఆజాదికా అమత్ మహోత్సవాలలో భాగంగా తనను అధికారులతో పాటు, ప్రజా ప్రతినిధులు ఘనంగా సత్కరించారని చెప్పారు.

మహిళా సాధికార దిశగా సాగాలి..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాధికారత దిశగా పయనించాలని, మహిళలు అన్ని రంగాలలో ముందుకు వస్తే దేశ అభ్యున్నతికి ఎంతో దోహద పడుతుందని ఆయన తెలియజేశారు, మహిళలు విద్యా, ఆర్థిక స్వాలంబన లభించినట్లయితే తమ కుటుంబమే కాకుండా, సమాజ శ్రేయస్సు కూడా బాగుంటుందని ఆయన అన్నారు,.

పేదరిక నిర్మూలన కు పాటుపడాలి..

ప్రజలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవినీతి రహిత పాలన అందించాలని, అలాగే కుల మతాలకు, పార్టీలకు అతీతంగా ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలు, అభివద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లయితే, పేదరిక నిర్మూలన అంతం మొందించినట్లు అవుతుందని ఆయన అన్నారు, భారతదేశం ఆర్థికంగా అన్నిరంగాల్లో ప్రపంచ దేశాల్లో మొదటి స్థానంలో ఉంటుందని, ఆయన అభిప్రాయపడ్డారు. భిన్న మతాలు, విభిన్న సంస్కతులు, సంప్రదాయాలు, గొప్ప భావజాలాలున్న దేశం.. తన దేశమని ఆయన తెలిపారు.

వరద బాధితులకు విరాళాల సేకరణ

ప్రజాశక్తి - బద్వేల్

సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వాయనాడ్ వరద బాధితుల కోసం విరాళాలు సేకరిం చామని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కె. శ్రీను పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వయనాడ్ ప్రాంతంలో అర్ధరాత్రి సమ యంలో వరదలు రావడంతో దాదాపు 300 మంది పైబడి చనిపోయారని పేర్కొ న్నారు. వారిని ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందిం చాలన్నారు. భాగంగా బద్వేల్ పట్టణంలో విరాళాలు సేకరించి వచ్చిన మొత్తాన్ని జిల్లా కేంద్రానికి పంపుతా మన్నారు. జిల్లాలో సేకరించినటువంటి నగదును రాష్ట్ర కమిటీ ద్వారా కేరళ ప్రభుత్వానికి అందజేయడం జరుగుతుందని చెప్పారు. సహకరించిన ప్రతి ఒక్కరికి సిపిఎం బద్వేల్ పట్టణ కమిటీ తరపున ప్రత్యేకమైనటువంటి ధన్యవాదాలు తెలియజేశారు. సమావేశం సిపిఎం నాయకులు ముడియం చిన్ని, కొండయ్య, యు ఆంజనేయులు, బాలస్వామి, గంప సుబ్బరాయుడు, మోక్షమ్మ అనంతమ్మ బాలమ్మ, మస్తాన్, ఫాతిమా పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న సిపిఎం నాయకులు

వైవీయూలో మెగా వైద్యశిబిరం



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న విసి, రోటరీ క్లబ్ చైర్మన్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప, రోటరీ క్లబ్ సహకారంతో బుధవారం వైవీయూలో నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి విస్తత స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని విసి ఆచార్య కె. కష్ణారెడ్డి, రోటరీ క్లబ్ చైర్మన్ సాదు గోపాలకష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ నాలుగు ప్రధాన విభాగాల్లో వైద్య సేవలు అందించడానికి వచ్చిన డాక్టర్లను అభినందించారు. రోటరీ క్లబ్ సేవలు భవిష్యత్తులో కూడా విశ్వవిద్యాలయానికి అందించాలని కోరారు. క్లబ్ చైర్మన్ సాధు గోపాలకష్ణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సమాజానికి అందిస్తున్న సేవలను వివరించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ వారణాసి ప్రతాప్ రెడ్డి, (డయాబెటిస్), డా.ఎ.వంశీధర్ (కార్డియాలజిస్ట్), డా.ఎ.విద్యాధర్, (నేత్ర వైద్యుడు), డా. ఎం.డి.ఫర్హానుద్దీన్ (డెంటిస్ట్) , వైవీయూ హెల్త్ సెంటర్ వైద్యులు డాక్టర్ నరేష్ కుమార్ రెడ్డి వైద్య సేవలు అందించారు. ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పుత్తా పద్మ, ప్రజా సంబంధాల విభాగం సంచాలకులు ఎస్.వి.సుబ్బారెడ్డి, దూరవిద్య ఉప సంచాలకులు డా.శ్రీధర్ బాబు, రోటరీ క్లబ్ జిల్లా అధ్యక్షులు సుధీర్ రెడ్డి, కార్యదర్శి నందిరెడ్డి, చార్టర్ ప్రెసిడెంట్ శివరామిరెడ్డి, పల్స్ పోలియో చైర్మన్ రెడ్డయ్య, కో చైర్మన్ తాజుద్దీన్, వైవీయూ అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - వల్లూరు

మండలంలోని గోటూరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న పిడిఎస్ రేషన్ బియ్యం పట్టుకున్నట్లు వల్లూరు ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. బుధవారం పక్క సమాచారంతో వాహనాలు పరిశీలిస్తుండగా ఒక ఆటోలో 29 మూటలు, 1450 కేజీల బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా వారిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశామన్నారు. ఎవరైనా మండలంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు

ప్రజాశక్తి-కలసపాడు

మండలంలో 13 పంచాయతీల అభివృద్ధికి తగిన ఆర్థిక ప్రణాళికను తయారు చేయాలని ఎంపిడిఒ మహబూబ్‌బీ తెలిపారు. బుధవారం మండల పరిషత్ సమావేశ కార్యాలయంలో సర్పంచుల, పంచాయతీ కార్యదర్శుల మూడవరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల ఆర్థిక అభివద్ధికి గ్రామాలలో ఇంటి పన్ను, మాత్రమే సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఎస్‌డిబ్ల్యూపిసి కేంద్రాలు ఏర్పాటుచేసి, వాటి వల్ల ఆదాయాన్ని చేకూర్చువచ్చని ఆమె తెలిపారు. గ్రీన్ అంబాసిడర్‌లు తడి చెత్తను, పొడిచెత్తను , ప్లాస్టిక్, ఇనుము, ఇలా వేరుచేయాలన్నారు. చెన్నుపల్లి సర్పంచ్ నవీన్ కుమార్ మాట్లాడుతూ సర్పంచులు కేవలం ప్రజలకు అందుబాటులో ఉండడమే కాకుండా గ్రామ అభివద్ధికి తమ వంతు కషి చేస్తున్నామని తెలి పారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి మురారి, ఎఒ వరదరాజులు, సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

కోడూరు మండలం అనంత రాజుపేట వైకోట క్రాస్ రోడ్డు వద్ద రెండు బైకులను లారీ ఢీకొన్న సంఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది.వివరాల్లోకి వెళితే.. మంగంపేట అగ్రహారంకు చెందిన వెంకట సుబ్బయ్య ఇరువురు రెండు బైక్ ల లో మంగంపేట నుంచి కోడూరుకు వెళుతుండగా కోడూరు నుంచి కడప వైపు అతివేగంగా వెళు న్న ట్రాలీ లారీ అనంతరాజుపేట, వై కోట క్రాస్ రోడ్ వద్దకు రాగానే బైక్ లను ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది ఈ సంఘటనలో వెంకటసుబ్బయ్య(45), సిద్దేశ్వర(40) ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరి పరిస్థితి విషమంగా వుంది మృతులు వెంకటసుబ్బయ్య ట్రైమాక్స్ కంపెనీ లో మిషన్ ఆపరేటర్ గా,సిద్దేశ్వర త్రివేణి లో డ్రైవర్ గా పనిచేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రైల్వే కోడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

-ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-కలికిరి

ద్విచక్ర వాహనాన్ని ఆర్టిసి బస్సు ఢీకొనడం తో ఇద్దరికీ తీవ్ర గాయాలైన సంఘటన కలిగిరి పట్టణంలో చోటు చేసుకుంది. బుధవారం మధ్యాహ్నం గుట్టపాలెం పంచాయతీ సి.బర్నేపల్లికి చెందిన బి.కృష్ణ మూర్తి కుమారుడు ఈశ్వరయ్య, అదే గ్రామానికి చెందిన రాజేష్‌లు కలికిరిలో కూలి పని ముగించుకుని తిరిగి వారి గ్రామం శ్రీ బర్నేపల్లికి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ఎల్లమ్మగుడి ఎదురుగా సోమల నుంచి కలకడకు వెళుతున్న పీలేరు డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో బస్సు టైర్ కింద పడి కాలు పూర్తిగా నలిగిపోయింది, రాజేష్‌కు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘ టన స్థలానికి చేరుకుని 108 సహాయంతో గాయపడిన ఇద్దరిని స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్యను మెరుగైన చికిత్స కొరకు తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. బాధితుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు.

సెమిస్టర్ ఫలితాల్లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-బి.కొత్తకోట



ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్

తిరుపతి ఎస్వి యూనిర్సిటీ బుధవారం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలి తాల లో బి.కొత్తకోట పట్టణం, రంగ సముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు 94 శాతం ఉత్తర్ణత సాధించి ప్రతిభ కనబరిచారు. బిఎస్‌సి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, బిఎస్‌సి కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఎస్.సమీరాభాను 92.5 శాతం, ఎస్.ఉమేరా ఫిర్దౌస్92 శాతం, డి.పవిత్ర 91 శాతం మార్కులు సాధించారు. బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఎస్.సమీర్ బాషా 93 శాతం, ఎం.జ్యోతిక 90 శాతం మార్కులు సాధించారు. బిఎస్‌సి కంప్యూటర్సులో కె.రెడ్డి రాణి 86.5 శాతం,యు.చరిత 84 శాతం మార్కులు సాధించారు.బీఎస్సీ కెమిస్ట్రీలో కె.తనుషా 84 శాతం,జి.అనిత 81 శాతం మా ర్కులు సాధించారు.ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆదిత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ బి.రాజేంద్ర, అధ్యాపకులు అభినందించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలి : 'సిటు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నో ఏళ్లుగా మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం మార్కెట్‌లో నూతన హమాలీ వర్కర్స్ యూనియన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాజంపేట మండల హమాలీల అధ్యక్షులుగా పి.రాముడు, సహ ఉపాధ్యక్షులు దేవేంద్ర, రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి బి.రవికుమార్, సహాయ కార్యదర్శి భీమిలింగ, కోశాధికారి ఆర్.రామస్వామి నాయక్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చిట్వేలి రవికుమార్ మాట్లాడుతూ ఎంతో కాలంగా మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీలకు బస్తాకు రూ.12లు ఇస్తున్నారని, వారి శ్రమను గుర్తించి బస్తాపై పది రూపాయలు కూలి పెంచాలన్నారు. ప్రమాదవశాత్తు మృతి చెందిన హమాలీలకు బీమా సౌకర్యం కల్పించాలని, వారికి మార్కెట్‌లో ఒక గదిని కేటాయించాలని, కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు ఓ.రమేష్, బి.లక్ష్మీ రంగయ్య, టి.లక్ష్మణ్, కే.రాముడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవికుమార్

విభిన్న ప్రతిభావంతులకు 'వెలుగు' భరోసా



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లి పట్టణం అమ్మచెరువు మిట్టలో గల వెలుగు సంస్థలో గరుండా స్కీం క్రింద 18 ఏళ్లు పైబడిన దివ్యాంగులకు శిక్షణ, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. బుధవారం వెలుగు కార్యదర్శి ఉదయ్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గరుండా శిక్షణ, పునరావాస కేంద్రం ఇన్‌ఛార్జి భాగ్యలక్ష్మిల అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డిఎస్‌పి డి.కొండయ్య నాయుడులు ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు. గరుండా స్కీం క్రింద శిక్షణ, పునరావాస కేంద్రాలను వేర్వేరుగా వారు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వెలుగు సంస్థలో అందుతున్న సేవలు ఎనలేనివని కొనియాడారు. విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ, పునరావాసం కల్పించడం మరింత సంతోషంగా ఉందన్నారు. వెలుగు సంస్థ పురోభివృద్ధికి తమవంతు సహాయ, సహకారాలు తప్పక ఉంటాయిని ప్రకటించారు. సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ మాట్లా డుతూ విభిన్న ప్రతిభావంతులకు ఎనలేని సేవలందిస్తున్న వెలుగు సంస్థ నిర్వాహకులను అభినందించారు. సంస్థ అభి వృద్ధికి తోడ్పాటును అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గరుండా స్కీం ఇన్‌ఛార్జి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కేంద్రం గుర్తించిన నాలుగు విభాగాల్లోని 18 ఏళ్ళ పైబడిన విభిన్న ప్రతి భావంతుల కోసం నైపుణ్య శిక్షణ ఇస్తూ జీవితకాలం పున రావాసం కల్పించే విధంగా కేంద్రాలు ప్రారంభించుకోవడం జరిగిందన్నారు. మొదటి ప్రయత్నంలో 20 మందికి ఉచిత వసతి, శిక్షణ అందిస్తామని చెప్పారు. వివిధ రకాల చేతి వృత్తు లపైన ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ కిషోర్, ఆడిటర్ కేఎస్ఎస్ ప్రసాద్, డాక్టర్ గోపికృష్ణ, ఎంఇ ప్రభాకర్ రెడ్డి, శ్రీకృష్ణ గ్రూప్స్ అధినేత మార్వారి శశిధర్ రావు, దేవత డిజిటల్ సతీష్, మస్తాన్ రెడ్డి, దేవేంద్రరెడ్డి, అడ్వకేట్ స్వామి, ఫోర్డ్ సంస్థ లలితమ్మ, కూం`పర్తి పద్మనాభ రెడ్డి, చైతన్య సర్వీస్ సొసైటీ ఎంపీ ఆనందన్, గ్రామజ్యోతి సుభద్ర, ధాత్రి ఫౌండేషన్ స్వాతి చక్రపాణి పాల్గొన్నారు.

ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం

జనసేన మహిళా నాయకులు నంద్యాల రెడ్డిరాణి

ప్రజాశక్తి-సుండుపల్లి

ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని జనసేన పార్టీ మహిళ నాయకులు నంద్యాల రెడ్డిరాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ చిన్న తనం నుంచే ప్రజా సేవలో ఉన్నానని అన్నారు. కరోనా సమయంలో కూడా పేదవారికి అండగా నిలిచి నిత్యావసర సరకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. తల్లి దండ్రులను కోల్పోయిన పిల్లల తన వంతుగా ఆర్థిక సాయం చేస్తున్నాని అన్నారు. యువతను క్రీడల్లో ప్రోత్స హించేందుకు క్రీడా సామగ్రి పంపిణీ చేశామని అన్నారు. ప్రతి యేటా పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్స్, పెన్ను పుస్తకాలు అందించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. పేద కుటుంబాలలో మరణించి వారికి అంతిమ సంస్కారం కోసం ఆర్థికసాయం అందించినట్లు తెలిపారు. నా జీవిత కాలం కూడా ప్రజాసేవలోనే అంకితం అవుతానని అన్నారు. గత ఎన్నికల్లో కూడా జనసేనపార్టీ బలోపేతానికి కృషి చేశానని తెలిపారు. స్వచ్ఛందంగా సేవ చేయడానికి ఏనాడు వెను కాడనని ఆమె తెలిపారు. మండలంలో కాకుండా రాజంపేట నియోజ కవ ర్గంలో జనసేన సభ్యు రాలుగా నాయ కురాలుగా ప్రతి సమస్యను తన దృష్టికి వచ్చిన వెంటనే వాటిని అధి కారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రభు త్వం అందించే పింఛన్లను దగ్గరుండి పంపిణీ చేస్తున్నట్లు ప్రజల ఏళ్లవేళలా అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.



చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-పుల్లంపేట

ఎపిఎండిసి సంస్థ మంగంపేట బ్రాంచ్‌లో పనిచేస్తున్న చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ మహిళా ఉద్యోగులను నిరంతరం సెక్షన్స్ మారుస్తూ వేదిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఎపిఎండిసి పరిపాలనా భవనం ముందు ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అన్నమయ్య జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్, కుల వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య మాట్లాడుతూ ఎపిఎండిసి సంస్థలో చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా ఉన్న సుదర్శన్ రెడ్డి మహిళా ఉద్యోగులను నిరంతరం సెక్షన్స్ మారుస్తూ ఇబ్బంధులకు గురిచేస్తున్నారనిఅన్నారు. నెలకు నాలుగు సార్లు మహిళా ఉద్యోగులను ముఖ్యంగా దళిత మహిళా ఉద్యోగినలను సెక్షన్స్ మారుస్తూ ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. ఇతనిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయని ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి విజిలెన్స్ ఎంక్వయిరీ కోరినట్లు చెప్పారు. ఇటువంటి ఆఫీసర్‌ని మంగంపేట బ్రాంచ్‌లో కొనసాగించడం చాలా బాధాకరమని వారు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు ఇటువంటి అధికారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఎపిఎండిసిఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్, సిఐటియు, జనరల్ సెక్రటరీ నారదాసు సుబ్బరాయుడు, సిఐటియు రైల్వే కోడూరు మండల కార్యదర్శి పి.జాన్‌ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు మద్దెల ప్రసాద్, కెవిపిఎస్, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డిఇఒ శివప్రకాష్‌రెడ్డి

బాలలను శాస్త్రవేత్తలుగా మార్చండి : డిఇఒ

ప్రజాశక్తి-రాయచోటి

ఇన్‌స్పైర్ మనాక్ వేదికను ఉపయోగించుకుని అన్వేషణాత్మక ఆలోచనలు కలిగిన విద్యార్థులను శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ప్రోత్సహించాలని డిఇఒ శివప్రకాష్‌రెడ్డి ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ మనాక్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల చిట్టి బుర్రలలో గట్టి ఆలోచనలు ఉంటాయని వాటికి పదును పెడితే బాల శాస్త్రవేత్తలు తయారవుతారని అన్నారు. పాఠశాలలో విద్యార్థుల మధ్య ప్రాజెక్టుల పోటీలు నిర్వహించాలని సూచించారు. స్థానిక సమస్యలకు పరిష్కారాన్ని చూపే వినూత్నమైన ప్రాజెక్టులను మాత్రమే నామినేషన్లలో చోటు కల్పించాలని ఉపా ధ్యాయులకు సూచించారు. అన్నమయ్య జిల్లాలోని ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి మూడు నామినేషన్లు, ఉన్నత పాఠశాల నుంచి ఐదు నామినేషన్లు తప్పనిసరిగా సమర్పించాలన్నారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ వారు వినూత్న ప్రాజెక్టులను మాత్రమే ఎంపిక చేసి పదివేల రూపాయల అవార్డును ప్రకటిస్తారన్నారు. ఇలాంటి అద్భుతమైన అవకాశాన్ని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యా సంస్థలన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం 3500 ప్రాజెక్టుల లక్ష్యంతో జిల్లాలోని ప్రతి పాఠశాల నుంచి నామినేషన్ల సమర్పించాలని పేర్కొన్నారు. డైట్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ అజయ్ కుమార్‌బాబు మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం విద్యార్థులలో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించాలని అన్నారు. అత్యుత్తమ శాస్త్రవేత్తలుగా విద్యార్థులను తీర్చిదిద్దడం సైన్స్ ఉపాధ్యాయులకు మాత్రమే సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమానికి శివలక్ష్మి, మధుసూదనరాజు, రాజేంద్రప్రసాద్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, ఎంఇఒ బాలాజీ, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఎజిపి తనిఖీ

ప్రజాశక్తి- కలకడ

మండల కేంద్రమైన కలకడలో ఉన్న బాలికల కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలను వాల్మీకిపురం అడిషనల్ ప్రభుత్వ లాయర్ అశోక్ కుమార్ రెడ్డి తనిఖీ నిర్వహించినట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. బుధవారం స్థానిక పాఠశాలల సందర్శించి పాఠశాలలో విద్యార్థులకు వడ్డిస్తున్న భోజనాలు తనిఖీ చేసినట్లు తెలిపారు. వారికి అందిస్తున్న కూరగాయలు, నిత్యవసర వస్తువులను తనిఖీలు నిర్వహించి, మెనూ ప్రకారం భోజనాలు వడ్డించాలని ఆదేశించినట్టు తెలిపారు.ప్రతి తరగతిలోని విద్యార్థులను వారి చదువు పట్ల కొన్ని విషయాలను అడిగి తెలుసుకున్నారని అన్నారు. విద్యార్థులకు పాఠశాలలో ల్యాబ్ లైబ్రరీ లేకపోవడం గుర్తించి వాటిని పాఠశాలలో ప్రవేశపెట్టేందుకు ప్రభుత్వానికి నివేదికలో పంపుతామని తెలిపారు.10వ తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు మంచి ఫలి తాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదే శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వాల్మీకిపురం బార్ ప్రెసిడెంట్ ఆనంద్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎజిపి

పీజీ వైద్య విద్యార్థిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలి



నిరసన తెలుపుతున్న వైద్యులు

ప్రజాశక్తి-పీలేరు

పశ్చిమబెంగాల్లో పీజీ వైద్య విద్యార్థినిపై హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి ఐఎంఎ పీలేరు బ్రాంచ్ వైద్యులు డిమాండ్ చేశారు. బుధవారం పీలేరు పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సమావేశమై హత్యకు గురైన వైద్యురాలికి నివాళు లర్పించి, నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. ఇటీవల కాలంలో వైద్యులపై భౌతిక దాడులు పెరుగుతున్న దృష్ట్యా, వాటిని అరికట్టడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యుల రక్షణ చట్టాన్ని పటిష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీలేరు ఐఎంఎ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రశేఖర్, సెక్రటరీ డాక్టర్ వై.పవన్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవయ్య, డాక్టర్ శ్రీనివాస్ గుప్త, డాక్టర్ మమతాలక్ష్మి గుప్త, డాక్టర్ రామాంజి, డాక్టర్ ఎల్లయ్య, డాక్టర్ అశ్వని, డాక్టర్ శ్రమంత్, డాక్టర్ గిరీష్ దేవర, డాక్టర్ శివయ్య, డాక్టర్ వసీం, తదితరులు పాల్గొన్నారు.









మాట్లాడుతున్న ప్రిన్సిపల్ యువరాజ్

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-మదనపల్లి

ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ అన్నారు. బుధవారం మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ముదివేడు పోలీస్ స్టేషన్, కళాశాల సిబ్బందితో యాంటీ రాగ్గింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సి.యువరాజ్ మాట్లాడుతూ ఉన్నత విద్యా వ్యవస్థలో ర్యాగింగ్‌ను అరికట్టడంలో పోలీసు శాఖ వారి పాత్రా ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కళాశాలకు కొత్తగా వచ్చే విద్యార్థులతో సీనియర్లు స్నేహభావంతో మెలగాలని పేర్కొన్నారు. ముదివేడు పోలీసుస్టేషన్ సిబ్బంది సహకారం ఎంతో అవసరమైన దన్నారు. ప్రతి రోజు హాస్టళ్లను సందర్శిం చడం, రాత్రి వేళల ఎక్కువగా విద్యార్థులు కలశాల ప్రాంగణంలో తిరుగడం నిషేధిం చడం, మత్తు పదార్థాలు, దూమపానాలు అమ్మకాలు మొదలైనవి అరికట్టడానికి తగిన చర్యలు తీసుకొన వలసిందిగా ముదివేడు పోలీసులను కోరుతున్నామని పేర్కొన్నారు. కళాశాల నుంచి అంగళ్ళుకు వెళ్లే మార్గంలో వీధి దీపాలను పునరుద్ధరించేలా తగిన చర్యలు తీసుకోవాలని అంగళ్ళు గ్రామా పంచాయతీ వారిని కోరుతున్నామని పేర్కొన్నారు. కార్యకమంలో ఎఎస్ఐ గజేంద్ర మాట్లాడుతూ రాత్రి సమయాన విద్యార్థులు రోడ్ల పైన, అంగళ్ళు పరిసరాలలో తిరగరాదు అని, కలశాల ప్రాంగణం మరియు అంగళ్ళులో ఉన్న హాస్టల్ యాజమాన్యాలు దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తమ పై ఆఫీసర్లతో సంప్రదించి మత్తు పదార్థాలు, దూమపానాలు అమ్మకాల నిషేధాన్ని అరికడానికి తగిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్వైసర్ ఆర్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


తహశీల్దార్‌ను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

బాధ్యతలు స్వీకరించిన అధికారులకు సన్మానం

ప్రజాశక్తి-రామాపురం

బదిలీలపై మండలానికి వచ్చిన అధికారులను టిడిపి నాయకులు అంజనారెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. బదిలీపై వెళ్లిన అధికారులకు వీడ్కోలు పలికి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇటీవల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన రామాంజనేయులుకు, ఎస్‌ఐ వెంకట సుధాకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. బదిలీపై వెళ్లిన ఎస్‌ఐ లక్ష్మీ ప్రసాద్‌రెడ్డికి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు అయోధ్య పురం పట్టాభి రెడ్డి, శివారెడ్డి, చిలేకంపల్లి శివారెడ్డి , శివశంకర్‌రెడ్డి, దేరంగుల శ్రీనివాసులు, చెన్నూరిబాబు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి : మదనపల్లె అర్బన్

పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు ఇందిరానగర్ పరిధిలోని మున్సిపల్ ఉర్దూ పాఠశాలలోని విద్యార్థులకు యస్‌ఆర్.లోకల్ వ్లాగ్స్ అండ్ యస్‌ఆర్.స్టూడియో అధినేత సయ్యద్‌బాషా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే చే నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, జామెంట్రీబాక్సులు, పలకలు, జాతీయ జెండాలను పంపిణీ చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ ఉర్దూ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు తనవంతు సహాయాన్ని అందిస్తున్న సయ్యద్ బాషాను అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరింత మంది సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. అనంతరం సయ్యద్‌బాషా మాట్లాడుతూ తనకున్న దానిలో ప్రతి వ్యక్తి ఎంతో కొంత సామాజిక అభివృద్ధి కోసం వినియోగించాలని కోరారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమానికి తమ ఆహ్వానం మేరకు ముఖ్య అతిధిగా హాజరైన ఎమ్మెల్యేకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాహుల్, ఆషిక్, వారీస్, అజీజ్, ఇర్షాద్, షాహీద్, ఆసిఫ్, సమీ, ఇమ్రాన్, తాహిర్, ప్రధా నోపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనులు కల్పించండి

ప్రజాశక్తి-సుండుపల్లి

మండలంలోని సుండుపల్లి గ్రామపంచాయతీలోనే చాకల పల్లె కుమ్మరిపల్లె గ్రామాలకు ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని వారు శుక్రవారం ఉపాధి కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు ఒక సంవత్సరం పైనుంచి ఉపాధి కూలీలని పనులే కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనేకసార్లు ప్రజాప్రతినిధులను అధికారులను దృష్టికి ఈ విషయం తీసుకెళ్లిన వారు పట్టించుకోలేదని చాలామంది కూలీలు ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నామని అన్నారు. గ్రామాలలో పనులు లేక ఉపాధి పనుల కోసం ఎదురు చూస్తున్నారని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు కల్పించాలని వారు కోరారు. గతంలో ఈ విషయాన్ని ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆయన కూడా స్పందించి పనులు కల్పించాలని సంబంధిత ఉపాధి ఎపిఒకు ఆదేశం చారని అన్నారు. వర్షాకాలంలో రైతులు పొలాలలో మొక్కలు నాటడం వంటి పథకాలను ఉపాధి కూలీలకు రైతులకు కల్పించి వాటిల్లో కూడా పనులు కల్పించాలని కోరారు.

రెపరెపలాడిన 'మువ్వన్నెల జెండా'


మహిళలతో కలిసి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ముందస్తు పంద్రాగస్టు వేడుకలు తుది దశకు చేరుకున్నాయి. బుధవారం పట్టణంలోని డ్వాక్రా సంఘాల మహిళలు, ఆర్‌పిలు, సంఘమిత్రలు పెద్ద ఎత్తున పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొన్నారు. జాతీయత ఉట్టిపడేలా త్రివర్ణ పతాకం లోని మూడు రంగులు కలగలిపేలా మహిళలు చీరకట్టు ప్రదర్శించారు. కన్నుల పండుగలా నిర్వహించిన ఈ వేడుకలు పుర ప్రజలను ఆకట్టుకున్నాయి. మదనపల్లె పట్టణమంతా జాతీయ గీతాలతో మారు మోగింది. పట్టణ పురవీధుల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. స్థానిక మిషన్ కాంపౌండ్ నుంచి చిత్తూరు బస్టాండ్, టౌన్ బ్యాంక్ సర్కిల్, బెంగళూరు బస్టాండ్, శ్రీకృష్ణ దేవరాయ సర్కిల్ మీదుగా స్థానిక అనిబిసెంట్ సర్కిల్ వరకు జాతీయ జెండాలు చేబూని భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ 78వ స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఇచ్చిన పిలు పుమేరకు ప్రతి ఒక్కరు కదలిరావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.

బి.కొత్తకోట : 78వ స్వాతంత్ర దినోత్సవ ఉత్సవాలను పురస్కరించుకొని మండలంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు ధర్మచక్రం ఆకారంలో కూర్చుని తమ దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రెడ్డి శేఖర్, ప్రిన్సిపల్ శీను నాయక్ మాట్లాడుతూ నేటి సమాజంలో రోజురోజుకు ధర్మం వెనుకబడుతోందని ప్రజలు మతసామరస్యాన్ని చిన్నతనం నుంచి అలవాటు చేసుకుని ఐక్యతను చాటాలన్నారు. కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లి : స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మండల బుధవారం జడ్‌పి ఉన్నత పాఠశాల, గిరిజన బాలుర రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు హర్ గర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ త్యాగరాజు, నాగ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండాలన్నారు. దేశాభివృద్ధికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ దేశాభివృద్ధికోసం పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్, ఎంపిడిఒ కార్యాలయ ఎఒ ఆనంద్‌కుమార్‌పాల్గొన్నారు.

విద్యార్థులకు లడ్డూలు వితరణ

ప్రజాశక్తి-కలికిరి: విశ్రాంత ఉపాధ్యాయుడు అన్ని పాఠశాలకు వితరణగా ఇచ్చారు. కలికిరి మండలంలోని నాయన చెరువు పల్లెకు చెందిన విశ్రాంత ప్రధాన ఉపాధ్యాయుడు ద్వారక నాథరెడ్డి అన్ని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఆయన తల్లిదండ్రులైన రంగమ్మ, రెడ్డప్పరెడ్డి స్మారకార్థం స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా లడ్డూలు పంపిణీ చేసినట్లు తెలి పారు. ద్వారక నాథరెడ్డిని ఎంఇఒ, కరీముల్లా, ఎంపిడిఒ గంగయ్యలు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సిఆర్‌పిలు, ఎంఇఒ నాగార్జున, ప్రధానోపా ధ్యాయులు మురాషావలి పాల్గొన్నారు.


విశ్వనాథరెడ్డిని సన్మానిస్తున్న ఎంఇఒ, ఎంపిడిఒ

బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐలు

ప్రజాశక్తి-రామాపురం


బాధ్యతలు చేపడుతున్న వెంకటసుధాకర్‌రెడ్డి

రామాపురం ఎస్‌ఐగా పి.వెంకటసుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల పోలీసు శాఖలో సాధారణ బదిలీలు భాగంగా చిత్తూరు సిసిఎస్ నుంచి బదిలీపై రామాపురం పోలీసు స్టేషన్‌కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన లక్ష్మీప్రసాద్‌రెడ్డి బదిలీపై రాజంపేట వెళ్లారు. ఈ సందర్భంగా బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ మాట్లాడుతూ రామాపురం మండలం ఎక్కువ శాతం నేషనల్ హైవే పైన ఉందని. ఎక్కువగా రోడ్డు ప్రమాదాల కేసులు నమోదవుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామని, శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

కలకడ: మండల కేంద్రమైన కలకడ ఎస్‌ఐ బదిలీపై వెళ్లడంతో, నూతన ఎస్‌ఐగా రామాంజులు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రామకృష్ణారెడ్డి కర్నూల్ రేంజ్‌కి వీఆర్‌కు బదిలీ కావడంతో, యాద మరిలో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న రామాంజులు ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టినట్టు తెలిపారు.ఈ సందర్భంగా నూతన ఎస్‌ఐ రామాంజులు మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ పై ప్రత్యేకంగా నిఘా ఉంచడం జరుగుతుందని, చోరీల నియంత్రణకు, జూదం, పేకాట, కోడి పందాలు తదితరాల నియంత్రణపై ఉక్కుపాదం మోపుతామని తెలిపారు.నాటుసారా తయారీ, అమ్మకాలు జరగకుండా గట్టి జాగ్రత్తలు తీసుకుంటా మని చెప్పారు. స్టేషన్ సిబ్బంది తనకు చేదోడు వాదోడుగా ఉండి సహకరించాలని ఆయన కోరారు.


బాధ్యతలు చేపడుతున్న రామాంజులు

నేడు వడ్డెర విద్యావంతుల వేదిక చైతన్య సదస్సు

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని మదనపల్లి రోడ్డులో ఉన్న అజయ్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జరగబోయే ఎపివడ్డెర విద్యావంతుల వేదిక చైతన్య సదస్సును విజయవంతం చేయాలని ఎపి వడ్డెర విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్, జిల్లా ప్రధాన కార్యదర్శి మారుతి శంకర్ పిలుపునిచ్చారు. బుధవారం మాసాపేటలోని ఒక ప్రైవేటు పాఠశాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో చంద్రశేఖర్, మారుతి శంకర్‌లు మాట్లాడుతూ తరతరాలుగా వడ్డెరలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని వడ్డెరల వెనుకబాటు ధనం పై చర్చించి ప్రభుత్వ ప్రభుత్వానికి విన్నవించడానికి విద్యావంతుల వేదిక కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వారు తెలిపారు .ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వస్తున్నట్లు వారు తెలియజేశారు. సమావేశానికి వడ్డెర విద్యావంతుల వేదిక కార్యకర్తలు వడ్డెరలు రాయచోటి చుట్టుపక్కల గల అన్ని మండలాల నుండి హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు.


మాట్లాడుతున్న చంద్రశేఖర్

సమావేశంలో విద్యావంతుల వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు ఈశ్వర్, గౌరవాధ్యక్షులు దేరంగుల రమణయ్య, డాక్టర్ లక్ష్మీప్రసాద్, విద్యావంతుల వేదిక నాయకులు జీవానందం, న్యాయవాది నాగమణి, రాంప్రసాద్, రామచంద్రయ్య, సర్పంచ్ వాసు, ఉపాధ్యక్షుడు చెల్లా రెడ్డయ్య, విజయనగరం రామకృష్ణ, గంగయ్య, హరినాథ్, తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోండి

-పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ సాదు సురేష్

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మినీ గోకులాలకు పాడి రైతులు దరఖాస్తు చేసు కోవాలని మండల పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ సాదుసురేష్ తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతులకు మరింత తోడ్పాటును అందించాలన్న ఉద్దేశంతో 90 శాతం సబ్సిడీతో పశువులు, గొర్రెలు సంరక్షణకై మినీ గోకులాల షెడ్లను మంజూరు చేస్తోందని అన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమలో కూడా అనుసంధానమైనప్పుడే ఆర్థిక పరిపుష్టిని సాధించగలరని తెలిపారు. అందులో భాగంగా ప్రభుత్వం పశువుల షెడ్లు 90శాతం సబ్సిడీతో, గొర్రెలు, మేకల షెడ్లు 70 శాతం సబ్సిడీతో మంజూరు చేస్తుందని అన్నారు. నాటుకోళ్లను పెంచుకునే వారు కూడా 70 శాతం సబ్సిడీతో షెడ్లను నిర్మించు కోవచ్చని తెలిపారు. ఎస్‌సి, ఎస్‌టి, మధ్య తరగతి, చిన్నా సన్నా కారు రైతులు అర్హులని తెలిపారు. షెడ్ల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను మంజూరు చేస్తారని చెప్పారు. రెండు పశువుల నుంచి ఆరు పశువుల షెడ్లు వరకు యూనిట్ ధర రూ. 1.15లక్షల నుంచి రూ.2.30లక్షల వరకు రైతు వాటా కేవలం రూ.11,500 నుంచి రూ. 23 వేలుగా ఉందన్నారు. ఆసక్తి కలిగిన రైతు లు రైతు సేవా కేంద్రాలలోని సిబ్బందిని సంప్ర దించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఎస్‌పిని కలిసిన టిడిపి నాయకులు


ప్రజాశక్తి-సుండుపల్లి

రాయచోటి లోని జిల్లా పోలీస్ కార్యాలయంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి అన్నమయ్య జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడుతో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజంపేట నియోజకవర్గం లోని పలు సమస్యలపై ఎస్‌పితో చర్చించినట్లు తెలిపారు. ఎస్‌పిని కలిసిన వారిలో టిడిపి వారిలో జిల్లా టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆదిశేషరెడ్డి, నందలూరు మండల మాజీ మండల అధ్యక్షులు భువన బోయిన లక్ష్మీ నరసయ్య, టిసుండుపల్లె మండల మైనార్టీ నాయకులు రాయవరం రఫీక్, లేబాక గ్రామ సర్పంచ్ లంకయ్య నరసయ్య, నందలూరు టిడిపి మండల నాయకులు ధనుంజయ నాయుడు, రాజంపేట తెలుగు యువత అధ్యక్షులు రాము యాదవ్, చినేపల్లి హరీష్ రాయల్, నందలూరు మండలం ఎల్లం రాజు పల్లి సుబ్బారెడ్డి, టిడిపి ఎస్‌సి నాయకులు ఉన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ పేర్కొన్నారు. మదనపల్లి మండలం వలసపల్లి జవహర్ నవోదయ విద్యాలయ లో ఆగస్టు 12 నుండి నిర్వహించిన రీజనల్ స్థాయి అథ్లెటిక్ మీట్లో భాగంగా బుధవారం 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్, 100, 400 రిలే హర్డ్ లెస్ పోటీలతో ఈవెంట్స్ ముగిశాయి. ఈ మీట్ లో 258 పాయింట్లతో కాసరగడ్ క్లస్టర్ మొదటి స్థానంలోనూ, 180 పాయింట్లతో బళ్ళారి క్లస్టర్ రెండవ స్థానంలోనూ, 162 పాయింట్లతో చిత్తూరు క్లస్టర్ మూడవ స్థానంలోనూ నిలిచాయి. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.ఇక్కడ ఎంపిక చేయబడిన క్రీడాకారులు రాంచి లోని ఖేల్గావ్‌లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు జి.సురేంద్రరెడ్డి హెచ్.కొటాయి, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సిఐ సాధిక్ అలీకి రాష్ట్రపతి మెడల్

నేడు సిఎం చంద్రబాబుచే స్వీకరణ

ప్రజాశక్తి-పీలేరు

జిల్లా పోలీసు విభాగం ఎస్‌బి-2లో సిఐగా విధులు నిర్వహిస్తున్న ఎ.సాదిక్ అలీకి ప్రభుత్వం రాష్ట్రపతి మెడల్ ప్రకటించింది. గురువారం విజయవాడలో జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఆయన రాష్ట్రపతి మెడల్ స్వీకరించనున్నారు. సాదిక్ అలీ 2002లో ఎస్‌ఐగా ఎంపికై, పోలీస్ శిక్షణలో బెస్ట్ ఆల్ రౌండర్ గా గుర్తింపు పొంది అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా మెడల్ తో పాటు పిస్టల్ అందుకున్నారు. 2002 లో ఆయన పిఎస్‌ఐగా పీలేరులో పనిచేసిన అనంతరం కెవి పల్లె ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన రోజు మొదలు నేటి వరకు 150కు పైగా ప్రశంసాపత్రాలు, రివార్డులు అందుకున్నారు. ఎస్‌ఐగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 10కి పైగా పోలీస్ స్టేషన్లలో పని చేశారు. ఎక్కడ పనిచేసినా అధికారులు, ప్రజల మన్ననలు పొందారు. 2011లో సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కడ మేజర్ క్రైమ్ జరిగినా పోలీసు అధికారులు సాదిక్ అలీని విచారణకు పంపడం ఆనవాయితీగా మారింది. 2014 నుంచి 2018 వరకు జిల్లా రెడ్ శాండల్ టీం లోపని చేసి, చైనాకు చెందిన అంతర్జాతీయ స్మగ్లర్ లీన్ డాన్ పూను అరెస్టు చేయడం అప్పట్లో సంచలనమైంది. ఆ టీం 500 టన్నుల ఎర్రచందనంతో పాటు 3 వేలకు మందికి పైగా స్మగ్లర్లను అరెస్టు చేసింది. రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన నగరి మొబైల్ ఫోన్ల దొంగతనం కేసులో కంజర్ భట్ తెగకు చెందిన దొంగలను అరెస్టు చేసి యు.8 కోట్ల విలువ చేసే మొబైల్ ఫోన్లను రికవరీ చేసి శభాష్ అనిపించుకున్నారు. దేశ ప్రఖ్యాత ఫిక్కి సంస్థ దక్షిణ భారత దేశంలో తొలిసారి తమ అవార్డును ప్రకటించి దాన్ని సాదిక్ అలీకి అందజేసింది. ఇప్పటి వరకు తన సర్వీస్ లో రెండు ఎబిసిడి అవార్డులు, ఒక సేవా పతకంతో పాటు 150కి పైగా ఇతర పురస్కారాలు అందుకున్నారు. పీలేరు సీఐగా పనిచేస్తుండగా కరోనా సమయంలో పలు సేవా కార్యక్రమాలు చేప ట్టి ప్రజల మన్ననలను పొందారు. పోలీసు శాఖలో సమర్ధత, సేవానిరతి కలిగిన సాదిక్ అలీ ఆ శాఖకు ఓ రోల్ మోడల్ అని చెప్పుకోవడం ఆ శాఖకే గర్వకారణం.

పంచాయతీల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : మండలంలోని గ్రామపంచాయతీల అభివృద్ధికి సర్పంచులు కార్యదర్శులు సహకరిం చాలని బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన నూతన ఎంపిడిఓ సురేంద్రనాథ్ కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న రిఫ్రెషర్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఇఒపిఆర్‌డి దిలీప్ కుమార్ రిసోర్స్ పర్సన్ రాజశేఖర్ నాయకులు సర్పంచుల విధులు, నిధుల వినియోగం పంచాయతీరాజ్ చట్టాలు, అభివృద్ధి ప్రణాళిక, చేపట్టాల్సిన పనులు పద్ధతులను వివరించారు.

జిల్లా కేంద్రం సాధనకు కట్టుబడి ఉన్నాం : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఎన్నికల హామీల లో చెప్పిన విధంగా రాజంపేటను జిల్లా కేంద్రం చేయడానికి టిడిపి పార్టీ కృత నిశ్చయంతో ఉందని, మొదట అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణంతోనే జిల్లా కేంద్రం సాధనకు ముందడుగు వేయడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి సరిపడా తాగు, సాగునీరు కావాలంటే ముందు అన్నమయ్య డ్యాం పునర్నిర్మాణం జరగాలని తెలిపారు. అన్నమయ్య డ్యాం సుమారు రెండు దశాబ్దాల పాటు వినియోగంలో ఉందని,ఆ సమయంలో కూడా లోతట్టు ప్రాంతాల వారికి నీరు అందక ఇబ్బందులు పడుతుండేవారిని తెలిపారు. ప్రస్తుతం వాతావరణంలో ఏర్పడ్డ ఎల్ నినో ప్రభావం చేత అధిక వర్షపాతం నమోదవుతుండడతో మరింత వరద నీరు ప్రాజెక్టుకు చేరే అవకాశం ఉన్నందున డ్యాం సామర్థ్యం కూడా పెంచుకునే అవసరం ఉందని అన్నారు. అంతేకాక గతంలో వలె ప్రమాదం జరుగుతుందేమోనన్న భయాం దోళనలు డ్యాం పరివాహక ప్రాంత ప్రజలలో ఉందన్నారు. ఈ సమస్యలన్నిటిని అధిగమిస్తూ డ్యామ్ పునర్నిర్మాణం చేపట్టాల్సి ఉందని చెప్పారు. కేంద్ర జల సంఘం



మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

సూచనల మేరకు 2.24 టిఎంసిల సామర్థ్యం కలిగిన అన్నమయ్య డ్యాం 8.23 నుంచి పది టిఎంసిల వరకు సామర్థ్యం పెంచి మరిన్ని గేట్లు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. కుడి, ఎడమ కాలువల ఏర్పాటు ద్వారా రాజంపేట, పుల్లంపేట, నందలూరు, పెనగలూరు ప్రాంతాలకు తాగు, సాగు నీరు అందించే దిశగా వ్యూహాత్మకంగా ముందుకెళ్లడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ నామినేషన్లు పూర్తిచేయాలి : ఎంఇఒ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ లోకేశ్వర్‌రెడ్డి

ప్రజాశక్తి-పీలేరు

ఇన్‌స్పైర్ మనక్ నామినేషన్లను త్వరగా పూర్తి చేయాలని మండల విద్యాశాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక అయ్యప్పరెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇన్స్పైర్ మనక్ నామినేషన్లు సమర్పించడానికి డివిజన్ స్థాయి ఇన్స్పైర్ గైడ్ టీచర్లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని యాజమాన్య పాఠశాలల నామినేషన్లు పూర్తి చేయాలని, ప్రతి ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3, ఉన్నత పాఠశాల నుండి 5 చొప్పున నామినేషన్స్ వేయాలని అన్నారు. మనక్ అనేది సైన్స్ సాంఘిక అనువర్తనాలలో పాతుకుపోయిన అసలైన ఆలోచనలు, ఆవిష్కరణలను అభివృద్ధి చేయడానికి విద్యార్థులను ప్రేరేపించడం, పాఠశాల విద్యార్థులలో సృజనాత్మకతతో వినూత్న ఆలోచనలు, సంస్కృతిని పెంపొందించడం ఈ అవార్డుల లక్ష్యమని చెప్పారు. రెండవ మండల విద్యాశాఖాధికారి పద్మావతమ్మ మాట్లాడుతూ విద్యార్థుల్లో కొత్త ఆవిష్కరణలు, సృజనాత్మక రీతిలో ఆలోచించేలా గైడ్ టీచర్స్ వ్యవహరించాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఫౌజియా బేగం మాట్లాడుతూ శిక్షణను చక్కగా తీసుకుని పాఠశాలలో ఐడియా బాక్స్ ద్వారా కొత్త ఆలోచనలను విద్యార్థుల నుండి తీసుకోవాలని కోరారు. జానం సుజాత, కేదారేశ్వర్, రవీంద్ర రెడ్డి రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించి ఇన్స్పైర్ మనక్ నామినేషన్ల ప్రక్రియ గురించి వివరిం చారు. గైడ్ టీచర్స్ సందేహాలను వారు నివృత్తి చేశారు. కార్యక్రమంలో పీలేరు, కలికిరి, కలకడ, వాల్మీకిపురం, కెవి పల్లి మండలాల నుంచి 75 మంది గైడ్ టీచర్లు హాజరయ్యారు.

రైతుల అభివృద్ధే కెవికె లక్ష్యం

-కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల

ప్రజాశక్తి-కలికిరి

రైతుల అభివృద్ధి లక్ష్యంగా కృషి విజ్ఞాన కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయని కలికిరి కెవికె కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. బుధవారం కృషి విజ్ఞాన్ కేంద్రం కలికిరి నందు మంగళ, బుధవారం రెండు రోజులు పాటు స్వర్ణోత్సవాలు రైతుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత వ్యవసాయ పరిశోధనా మండలి మొట్ట మొదటగా 1974వ సంవత్సరంలో పుదుచ్చేరి నందు మొదటి కెవికెను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్నదని. తర్వాత క్రమంగా అన్ని రాష్ట్రాల్లో ఈ కృషి విజ్ఞాన కేంద్రాలు నెలకొన్నాయని, ఇప్పుడు మన దేశంలో మొత్తం 731 కెవికెలు రైతులకు సహకారాన్ని అందజేస్తున్నాయి. 50 సంవత్సరాల స్వర్ణోత్సవ వేడుకలను ప్రతి కృషి విజ్ఞాన కేంద్రం నందు స్వర్ణోత్సవ జ్యోతితో జరుపుకుంటున్నామని అందులో భాగంగా కె.వి.కె కలికిరిలో రెండు రోజుల పాటు వేడుకలను జరుపుకుంటున్నట్లు తెలిపారు. 13వ తేదీన కెవికె సిబ్బంది మూరేవాండ్లపల్లిలో రైతులను సమావేశపరిచి ముఖ్యమైన పంటలైన మామిడి, వేరుశనగ, వరి మొదలగు వాటిలో యాజమాన్య పద్ధతులను, ఆధునిక వంగడాలను వివరించారు. కెవికెల ప్రాముఖ్యతను గూర్చి చెప్పారు. తదుపరి కోత తర్వాత మామిడిలో కొమ్ము కత్తిరింపులను ప్రయోగాత్మకంగా డాక్టర్ ఏ శ్రీనివాసులు శాస్త్రవేత్త చేసి చూపించారు. కొబ్బరిలో ఎర్రనల్లి నివారణ గురించి డాక్టర్ కే మంజుల మరియు డా.వై.పీరు సాహెబ్ తెలియజేశారు. వేరుశనగలో అక్కడక్కడ కనిపిస్తున్న కాండం కుళ్ళు వైరస్ మొక్కలను తీసివేసి నాశనం చేయాలని డాక్టర్ సోమశేఖర్ బాబు, డాక్టర్ మాధురి తెలిపారు. తదుపరి జీవ శిలీంద్ర నాశినీలు అయిన సూడోమోనాస్, ట్రైకోడెర్మాలను రైతులకు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో 30 మంది రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి సీనియర్ సైంటిస్ట్, డ్రోన్



స్వర్ణోత్సవ వేడుకల్లో కెవికె శాస్త్రవేత్తలు, సిబ్బంది

స్పెషలిస్ట్ వ్యవసాయంలో డ్రోన్ల పాత్రను వివరించి డ్రోన్ ఆపరేషన్‌ను ప్రయోగాత్మకంగా రైతులకు చేసి చూపించారు. డాక్టర్ గుణశేఖర్ పిళ్లై జిల్లా పశుసంవర్ధక అధికారి ప్రభుత్వం తరపున ఉన్న వివిధ పథకాలను రైతులకు వివరించారు. కుమారి మమత, మండల వ్యవసాయ అధికారి తృణధాన్యాల ప్రాముఖ్యతను గూర్చి చెప్పారు. సేంద్రియ పద్ధతులను అవలంబించాలి అన్నారు. అనంతరం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ కెవికె లక్ష్యం రైతులకు సమయానుకూలంగా సూచనలు ఇవ్వడం పరిమితిలో ఇన్‌పుట్ అందిస్తామన్నారు. ప్రస్తుత కాలంలో ఎక్కువ దిగుబడులను ఉద్దేశించి రైతులు పురుగుమందులు, తెగుళ్ల మందులు, కలుపు మందులు కొన్ని పంటల మీద (ముఖ్యంగా టమోటో) విరివిగా వాడేస్తున్నారని తద్వారా మోతాదుకు మించి విష పదార్థాలు మన శరీరంలోకి వెళ్తున్నాయని ఇవే రకాల ఆరోగ్య సమస్యలకు దారి తీస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఏ శ్రీనివాసులు, సోమశేఖర్ బాబు, డాక్టర్ వై.పీరుసాహెబ్, డాక్టర్ కే.మాధురి, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమావేశానికి 60 మంది రైతులు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు పాల్గొన్నారు.



నులిపురుగుల నివారణ దినోత్సవం పై చర్చించుకుంటున్న అధికారులు

నులిపురుగుల నిర్మూలనకు చర్యలు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని డాక్టర్ ప్రత్యూష, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎంఇఒ నారాయణలు కలసి ప్రణాళికలను రూపొందించారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో అధికారులు సమావేశమై ఆగస్టు 20వ తేదీ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవంలో భాగంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయ సిబ్బందికి, 2 నుంచి 19 సంవత్సరాలు లోపు ఉన్న విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయాలని అన్నారు. డాక్టర్ ప్రత్యూష మాట్లాడుత పిల్లలలో శుభ్రత లేకపోవడం వల్ల నులిపురుగులు రావడం జరుగుతుందన్నారు. తద్వారా వారు రక్తహీనతకు గురై అనారోగ్యం బారిన పడతారని తెలిపారు. అనారోగ్యానికి కారణమయ్యే నులిపురుగును నివారించడానికి ప్రతి ఆరు నెలలకోసారి ఆల్బెండజోల్ 400 ఎంజి మాత్రను 2 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్నపిల్లలకు, రెండు సంవత్సరాల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలకు ఆరమాత్ర తిసుకోవాలని సూచించారు. ఆల్బెండజోల్ మాత్రలతో విద్యార్థులలో రక్తహీనతను కలిగిస్తున్న నులిపురుగు నివారణ సాధ్యమవుతుందని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ దేవేంద్ర, కిరణ్ పాల్గొన్నారు.



బోధనతీరును పరిశీలిస్తున్న న్యాయమూర్తి

ఉన్నత ఆశయంతో చదవాలి

-న్యాయమూర్తి ఉమర్ ఫరూక్

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

బాలికలు ఉన్నత ఆశయం చదివి, ఉన్నత స్థాయికి చేరాలని స్థానిక న్యాయమూర్తి ఉమర్ ఫరూక్ అన్నారు. బుధవారం మధ్యాహ్నం కస్తూర్బా గాంధీ గురుకుల బాలికల విద్యాలయాన్ని తంబళ్లపల్లె సివిల్ జడ్జి ఉమర్ ఫరూక్ సందర్శించారు. పాఠశాల మౌళిక సదుపాయాలు, తరగతి గదులు, డిజిటల్ క్లాస్ రూమ్, విద్యార్థుల విద్యా సామర్థ్యాలు, భోజన వసతులు, పరిసరాలు, బాలికలకు రక్షణ అవసరాలు పరిశీలించారు. అన్నీ పరిశీలించిన తర్వాత సంతృప్తి వ్యక్తం చేశారని ఎంఇఒలు త్యాగరాజు,నాగ సుబ్బారాయుడు, ప్రిన్సిపల్ ఎన్.ఎస్.శ్రీమతి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలికల చదువు దేశానికి వెలుగు

-పద్మశ్రీ అవార్డు గ్రహిత శోభరాజ్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బాలికల చదువుతో దేశ అభివృద్ధికి సంకేతమని పద్మశ్రీ అవార్డు గ్రహిత శోభరాజ్ పేర్కొన్నారు. సిఆర్‌వై, పోర్డ్ సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న పూరి పదాయ్‌దేశ్‌కి భళాయ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం షి లర్న్ - షి లీడ్ పోస్టర్లని పోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మతో కలసి టిటిడి ఆస్థాన గాయని పద్మశ్రీ అవార్డు గ్రహిత శోభరాజ్ విడుదల చేశారు. బుధవారం మదనపల్లి పర్యటనలో భాగంగా శోభరాజ్‌ని లలితమ్మ మర్యాద పూర్వకంగా కలుసుకొని షి లర్న్ - షి లీడ్ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించారు. ఆమె ద్వారా సమాజానికి మంచి సందేశాన్ని పంపే విధంగా పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా లలితమ్మ స్పందింస్తూ కార్యక్రమంలో పాల్గొన పద్మశ్రీ అవార్డు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక అక్రమ తవ్వకాలను అరికట్టాలి : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాను కట్టుదిట్టమైన చర్యలతో అరికట్టాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కానారేన్స్ హాల్‌లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ విద్యా సాగర్ నాయుడు, జెసి ఆదర్శ రాజేంద్రన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా మైనింగ్ శాఖ అధికారి, ముందుగా ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్ 43లో పేర్కొన్న విధంగా జిల్లాలో ఇసుక స్టాక్ పాయింట్లను, ఇసుక మైనింగ్ పాయింట్లను తనిఖీ చేసేందుకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్, డివిజన్ స్థాయి టాస్క్ ఫోర్స్ మరియు మండల స్థాయి టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్టుగా వివరించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ఎస్పీతో పాటు వివిధ శాఖల అధికారులు సభ్యులుగా ఉంటారని తెలిపారు. డివిజన్ స్థాయిలో సబ్ కలెక్టర్ లేదా ఆర్‌డిఒ అధ్యక్షులుగా ఉంటారని, మండల స్థాయిలో తహశీల్దార్, ఎంపిడిఒలు సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉచిత ఇసుక పాలసీని అమలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, జీవో నెంబర్ 43ను అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని, రాజంపేట మండలం బోడి గుంట పల్లెలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ఏజెన్సీని త్వరగా ఖరారు చేయాలని ఆదేశించారు. ఉచిత ఇసుక పాలసీని అమలు చేసేందుకు ఏర్పాటు చేసిన కమిటీలన్నీ వారికి కేటాయించిన విధులను తగిన విధంగా నిర్వర్తించాలన్నారు.జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ అక్రమ మైనింగ్ లేదా అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఉచిత ఇసుక పాలసీని అమలు చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్‌కు తెలిపారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, రాయచోటి ఆర్డిఓ రంగస్వామి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నేతలు

వేంపల్లె బస్టాండును త్వరగా ప్రారంభించాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో నూతనంగా నిర్మించిన ఆర్టీసీ బస్టాండును త్వరగా ప్రారంభించాలని టిడిపి నాయకులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరారు. బుధవారం టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, లోమడ భాస్కర్‌రెడ్డి (ఎల్‌బిఆర్) రాయచోటిలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చారు. గత ప్రభుత్వ పాలనలో ఆర్టీసీ బస్టాండు నిర్మాణం జరిగిందన్నారు. కొన్ని పనులు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. ఆ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరారు. బస్టాండు నిర్మాణం పూర్తి కాకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని వివరించారు. స్పందించిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లా డు తూ వెంటనే బస్టాండు పనులు పూర్తి చేసి ప్రయాణికుల ఇబ్బందులను తొలగిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో టిడిపి నేతలు గొటూరు నాగభూషణం, భాస్కర్, మహబూబ్ షరీఫ్ పాల్గొన్నారు.



విద్యుత్ స్తంభం మార్చుతున్న అధికారులు

పుష్పగిరి మన్యం కాలనీలో విద్యుత్ స్తంభం మార్పు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నగర పంచాయతీ పరిధిలోని పుష్పగిరి మన్యం కాలనీలో విరిగిన విద్యుత్ స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు. కాలనీలో ఉన్న సమస్యను స్థానికులు జనసేన పార్టీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ దేరంగుల జగదీష్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన జగదీష్ విద్యుత్ శాఖ ఎడిఇ కిరణ్‌కుమార్‌తో మాట్లాడి విరిగిన స్తంభం స్థానంలో కొత్త విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు జగదీష్‌ను అభినందించారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి

- ఎడిఎ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి - చక్రాయపేట

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటల సాగు లాభదాయకమని, మంచి దిగుబడి వస్తుందని పులివెందుల డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకుడు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. నాగలగట్టుపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం ఆయన సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి నవంత్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎడిఎ ముఖ్యఅతిథిగా మాట్లా డుతూ రైతు సేవ కేంద్రాల ద్వారా వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వంద శాతం అందు బాటులో ఉండాలన్నారు. వ్యవసాయ సూచనలు ఇచ్చేం దుకు సిబ్బంది రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండా లన్నారు. తక్కువ పెట్టుబడితో మంచి నాణ్యమైన దిగుబడులు సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవ సాయ మండల ఇన్‌ఛార్జి ప్రతాప్, ఆయా సిబ్బంది పాల్గొన్నారు.



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

మెరుగైన బోధనకు ప్రత్యేక చర్యలు

- ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప

ప్రజాశక్తి - సింహాద్రిపురం

విద్యార్థులకు మెరుగైన విద్యా బోధనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప పేర్కొన్నారు. అంకాలమ్మ గూడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం కృష్ణప్ప మాట్లా డుతూ ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందిస్తు న్నామ న్నారు. రుచికరమైన మధ్యాహ్నం భోజనం అందించాలని ఏజెన్సీ నిర్వాహలకు సూచించారు. ముఖ్యంగా ఉపాధ్యాయులు విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించకుండా విద్యార్థుల అభ్యున్నతికి దోహదపడాలని సూచించారు. అనంతరం తరగతి గదిలోకి వెళ్లి విద్యా బోధనపై విద్యార్థులను అడిగి తెలుసు కున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు విజయభాస్కర్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప

మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలి

- పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

పేదల ఆకలి తీర్చే సదుద్దేశంతో అన్న క్యాంటీన్లు ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని, అయితే మండల కేంద్రాల్లో కూడా అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని పిసిసి మీడియా చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అన్న క్యాంటీన్లు నగర, పట్టణ ప్రాంతాలకే పరిమితం చేయడం సమంజసం కాదన్నారు. పేదలు గ్రామీణ ప్రాం తాల్లో కూడా ఉంటారన్నారు. గ్రామీణ పేదల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. మండల కేంద్రాల్లో, మేజర్ గ్రామ పంచాయతీల్లోనైనా ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్రంలో 454 గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని, ఇందులో 189 ఎస్సీ, 80 ఎస్టీ, 124 బిసి, 61 ఒసి ఉన్నట్లు చెప్పారు. 2.27 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు వివరించారు. 20 వేల మంది సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. 3నెలలుగా సిబ్బందికి జీతాలు లేవని తెలిపారు. 5 నెలలుగా కూరగాయలు, గ్యాస్, పప్పులు, ఇతర సరుకులు సరఫరా చేసే వారికి బిల్లులు చెల్లించలేదని తెలిపారు. వెంటనే సిబ్బందికి పెండింగ్ జీతాలు, సరఫ రా దారులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని తులసిరెడ్డి కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



వ్యర్థ పదార్థాలను తొలగిస్తున్న సిఐ, ఎస్ఐ, సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, అది అందరి బాధ్యతని మైదుకూరు రూరల్ సిఐ జె.శివశంకర తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ చిన్న పెద్దయ్య ఆధ్వర్యంలో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. హైస్కూల్ పరిసరాల్లో వ్యర్థ పదార్థాలను తొలగించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా మత్తు పదార్థాలు ఉపయోగించి గాజు బాటిళ్లను పారవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గృహావసరాలకు వినియోగించిన ప్లాస్టిక్ వస్తువులను క్లాప్ మిత్రలకు అందివ్వాల్సి ఉంటుందన్నారు. ఎక్కడ పడితే అక్కడ వేయకూడదన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటుకు మార్కింగ్

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి గ్రామం నుండి కోనంపేట వరకు సెల్‌ఫోన్ వచ్చినప్పటి నుంచి నేటి వరకు సురభి గ్రామంలోని మల్లికివాండ్లపల్లె, మహబూబ్ నగర్, కుప్పగట్టుపల్లె, బోడు గుండుపల్లె, ఊటుకూరు వాండ్లపల్లె, పాయిలోపల్లె, లక్ష్మీపురం, వరికుంటపల్లె గ్రామాల్లో ఏ సెల్ టవర్ సిగ్నల్ లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండల టిడిపి ఇన్‌ఛార్జి మహేశ్వర్‌రెడ్డి బిఎస్ఎన్ఎల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బుధవారం బిఎస్ఎన్ఎల్ డిఇ రెడ్డి బాబు, బిఎస్ఎన్ఎల్ జెటిఒ తహశీల్దార్ పివిజయ కుమారిని కలిశారు. లక్ష్మీపురం గ్రామం వద్ద, ఊటుకూరు వాండ్ల పల్లె గ్రామం వద్ద, రెండు బిఎస్ఎన్ఎల్ టవర్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ స్థలానికి గుర్తించి మార్కింగ్ ఇవ్వాలని కోరారు. అదేవిధంగా సబ్ డివిజన్ తర్వాత అడ్వాన్స్ పొజిషన్ సర్టిఫికెట్ ఇస్తే త్వరగా పనులు ప్రారంభిస్తామని బిఎస్ఎన్ఎల్ అధికారులు తెలిపారు. తహశీల్దార్ విజయకుమారి వెంటనే స్పందిస్తూ సర్వేయర్‌ను వారి వెంట పంపారు. దీంతో బిఎస్ఎన్ఎల్ వినియోగదారులు మహేశ్వర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞత అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు పరమేశ్వర, సుదర్శన్, మహేష్, అమర పాల్గొన్నారు.



తహశీల్దార్‌తో మాట్లాడుతున్న బిఎస్ఎన్ఎల్ అధికారులు

పులివెందుల ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన నారాయణ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల అర్బన్ ఎస్ఐగా నారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న విష్ణు నారాయణను ఉన్నతాధికారులు బదిలీ చేయడంతో ఆయన స్థానంలో కడప రిమ్స్ పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న నారాయణను పులివెందులకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉపేక్షించే ప్రసక్తి లేదని తెలిపారు.





ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఆంధ్రప్రదేశ్ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బుధవారం మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఇఇ పి. శ్రీనివాసులు మాట్లాడుతూ మట్టితో చేసిన వినాయకుని విగ్రహాలను మాత్రమే పూజిస్తే పర్యావరణానికి ఎంతో మేలు చేసిన వారమ వుతామన్నారు. పర్యావరణ పరిరక్షణ మన బాధ్యతని, పర్యావరణాన్ని మనమే కాపా డుకోవాలని పేర్కొన్నారు. అనంతరం కళా జాత బృందం పాట, మాటలు ద్వారా ప్రజలకు చక్కగా అవగాహన కల్పించారు. కార్యక్ర మంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఎఇ అనిల్ కుమార్ రెడ్డి, ఎంవి రూరల్ ఫోక్ ఆర్ట్ ఆర్గనై జేషన్ కళజాత సభ్యులు రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

అవినీతి జరగలేదని చెప్పడం విడ్డూరం

- టిడిపి కడప పార్లమెంట్ కార్యదర్శి మైసూరారెడ్డి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలో వైసిపి ప్రభుత్వంలో అవినీతి జరగలేదని ఆ పార్టీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందని తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరారెడ్డి పేర్కొన్నారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చేసిన తప్పులను ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిజమైన అర్హులకు మాత్రమే హౌసింగ్ పట్టాలు ఇవ్వాలని కోరారని, అలా కాకుండా వైసిపి నాయకులకు చెప్పిన వారికి జగనన్న కాలనీలో 8000 గృహాలు మంజూరు చేయడం జరిగింది.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల పట్టణంలోని కదిరి రోడ్డు సమీపంలో ఉన్న మద్యం దుకాణంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. బుధవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన సిబ్బంది తలుపులు తెరవగానే వెనక భాగంలో ఉన్న తలుపులు, లాకర్ పగలగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ అనిల్‌కుమార్ తన సిబ్బందితో చేరుకొని పరిశీలించారు. మద్యం దుకాణం వెనకవైపు క్షుణ్ణంగా పరిశీలించి మద్యం దుకాణ సూపర్వైజర్ భాస్కర్‌ను వివరాలు అడిగి తెలుసు కున్నారు. లాకర్‌లో ఉన్న దాదాపు నాలుగు లక్షల 23 వేల రూపాయల నగదు, 9 క్వార్టర్ల బాటిళ్ల దోచుకెళ్లారు. షాపునకు సెక్యూరిటీ సిబ్బంది ఉండగా చోరీ ఎలా జరిగిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సూపర్వైజర్ భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స

జమ్మలమడుగు రూరల్ : గొరిగనూరు గ్రామంలో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్, జిల్లా పశుగణాభివృద్ధి సంఘం, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం కార్య నిర్వహణ అధికారి రమేష్ జమ్మల మడుగు డివిజన్ భాగ్య ఉపసంచాలకులు వెంకటరామిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తా : ఎస్ఐ

ప్రజాశక్తి - కొండాపురం



శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరు ఎస్ఐ హృషికేశవరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కొత్తగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తదితర వాటిపై ప్రత్యేకదృష్టి సారిస్తామన్నారు. పోలీసు సిబ్బంది నూతన ఎస్ఐకు శుభాకాంక్షలు తెలిపారు.



తహశీల్దార్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ సానే సుబ్బరాయుడు

బాధ్యతలు చేపట్టిన అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - చక్రాయపేట

కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ జీవి కృష్ణయ్య, తహశీల్దార్ పి.విజయకుమారిని నేరుసుపల్లె మాజీ సర్పంచ్ సానే సుబ్బరామయ్య, యువ నాయకుడు సానే రాహుల్ కలిశారు. ఈ సందర్భంగా వారు ఎస్ఐని, తహశీల్దార్‌ను సన్మానించారు. రైతుల భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలని తహశీల్దార్‌ను కోరారు.



ఆందోళన చేస్తున్న ప్రజలు

ఫ్లైయాష్ కాలుష్యం నుంచి కాపాడండి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని ఆర్టీపీపీ నుంచి ఫ్లైయాష్ రవాణా చేస్తున్న లారీలు, ట్రాక్టర్ల నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సమీప గ్రామ ప్రజలు ఆందోళనకు దిగారు. బుధవారం ఫ్లైయాష్ సరఫరా చేస్తున్న లారీలను రోడ్లపై ఆపి ఆందోళనలు చేశారు. ఇప్పటికే థర్మల్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే కాలుష్యం అధికంగా ఉందని, తాజాగా ఫ్లైయాష్ రవాణా చేసే వాహనాల ద్వారా ఇళ్లల్లోకి కాలుష్యం చేరుతోందని వాపోయారు. తద్వారా అనేక అనారోగ్య సమస్యలకు కారణమవుతున్నామని చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లై యాష్‌కు సంబంధించిన ఎడి స్థాయి అధికారి తమ విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో సమస్యలు వస్తున్నాయని తెలిపారు.

కంటి జబ్బుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : కంటి జబ్బుల పట్ల జాగ్రత్తలు తీసుకోవలని ఆప్తాల్మిక్ అధికారి కె.జె. రఘురామిరెడ్డి బుధవారం అన్నారు. స్థానిక వైవిఎస్ మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో గత నాలుగు రోజులుగా బాలికలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుకు 250మందికి చొప్పున 1060 మంది బాలికలకు పరీక్షలు నిర్వహించి 138 మంది పిల్లలకు దృష్టిలోపం ఉన్నట్లు గుర్తించామన్నారు. అందరికీ కడప జిల్లా అంధత్వ నివారణ సంఘం ద్వారా ఉచిత కళ్లద్దాలు పంపిణీ చేస్తామన్నారు. అక్షరాలు కనిపించక చదువులో వెనకబడిపోయే ప్రమాదం ఉందన్నారు.

వీధిలైట్ల నిర్వహణ బాధ్యత పంచాయతీలదే



మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి రాధాకృష్ణవేణి

ప్రజాశక్తి - చాపాడు

గ్రామాల్లో వీధిలైట్ల నిర్వహణ బాధ్యత పూర్తిస్థాయిలో పంచాయతీలదేనని ఈఓపీఆర్డీ రాధాకృష్ణ వేణి తెలిపారు. బుధవారం స్థానిక మండల సభా భవనంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు 3వ రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్ఈడీ లైట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఏదైనా సమస్య ఏర్పడి అవి పని చేయనప్పుడు వాటిని పంచాయతీ నిధులతో సిద్ధం చేయించాల్సి ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులను మంజూరు చేస్తుందన్నారు. ఆ నిధులను తాగునీరు, పారిశుధ్యం, ఇతర అవసరాలకు వినియోగించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులు, సర్పంచ్‌లపై ఉంటుందన్నారు. ట్రైనర్లు శ్రీని వాసులు, సుధాకర్, ధనేశ్వర్ బాబు, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పెద్దముడియం : ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిడిఒ వెంకటరమణ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామాల్లో మురుగు రోడ్లపై పారే చోట మురుగు కాలువలను వెంటనే పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు సూచించారు. దోమల నివారణ చర్యలు తీసుకొని గ్రామాల్లో దోమల పొగను కొట్టించాలన్నారు. కార్యక్రమంలో ఈఓపిఆర్‌డి విజయభారతి, మండల పంచాయితీ కార్యదర్శులు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : గ్రామ పంచాయతీలో అన్ని విధాలా అభివద్ధి సాధించాలంటే సర్పంచ్‌లే కీలకమని ఈఓపిఆర్‌డి పద్మనాభరెడ్డి పేర్కొన్నారు. సింహాద్రిపురం ఎంపీడీవో సభ భవనంలో సర్పంచ్‌లు, పంచాయతీ సెక్రటరీల శిక్షణ తరగతులు ముగింపు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఇతర వర్గాల అభ్యున్నతి సాధించడానికి తీసుకోవాల్సిన అంశాలపై వివరించారు. ముఖ్యంగా పంచాయతీ పరిధిలో ఆర్థిక వనరులను గుర్తించి వాటిని పంచాయతీ పరిధిలోనే ఖర్చు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైలర్స్ అరుణ్, అనిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి

ప్రయివేట్ ఫైనాన్స్ ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి



మాట్లాడుతున్న సిపిఎం నేత ఏసుదాసు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రొద్దుటూరు పట్టణంలోని ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ ఆగడాలను ప్రభుత్వం అడ్డుకట్ట వేయాలని జమ్మలమడుగు సిపిఎం కార్యదర్శి జి.ఏసుదాస్ పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని ఎన్జీవో హోంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొద్దుటూరు పట్టణంలోని ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ కంపెనీ పేద ప్రజలకు అధిక వడ్డీతో ఫైనాన్స్ ఇచ్చి వేధింపులకు గురిచేస్తుందని అన్నారు. ఒకటి, రెండు వాయిదాలు చెల్లించకపోవడంతో పేద ప్రజల ఇళ్లకు తాళాలు వేస్తామని చెప్పి బెదిరించడం సబబు కాదన్నారు. జమ్మలమడుగు ప్రాంతంలో పేద ప్రజలకు ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలు అధిక వడ్డీలతో రుణాలు అందించారు. ముఖ్యంగా దళితులు ఈ ఐఐ ఎఫ్ఎల్ ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలు బారినపడి బాధితులవుతున్నారని తెలిపారు. ప్రభుత్వ భూములకు, స్థలాలకు ప్రయివేట్ ఫైనాన్స్ కంపెనీలు రుణాలు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేపించి రుణాలు ఇస్తున్నారని, అలాంటి కంపెనీలను గుర్తించి ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఫైనాన్స్ ప్రతినిధులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బాధితులతో జమ్మలమడుగు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం సభ్యులు ఎ.వినయ్ కుమార్, రఫీ, హాజీ పాల్గొన్నారు.

చీటిపాయి భూములలో పేదలను యథావిధిగా కొనసాగించాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండల పరిధిలోని సోమిరెడ్డిపల్లె రెవెన్యూ గ్రామం చీటిపాయిలో పేదలు సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్ కోరారు. బుధవారం ఉదయం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అన్వేష్ మాట్లాడుతూ.. స్థానిక పేదలు గత పది సంవత్సరాల నుంచి చీటీపాయిలో ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వకపోవడం వలన ఆ భూములను సాగు చేయకుండా అడ్డుకుంటున్నారని అన్నారు. అదేవిధంగా భూ కబ్జాదారులు స్వాధీనంలో ఉన్న భూములలో మామిడి, చీనీ, జామ, టేకు నాటిన మొక్కలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ఆ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అసైన్డ్ భూములు స్థానిక నిరుపేదల కుటుంబాలకు మాత్రమే.. చీటిపాయిలో వందల ఎకరాల ప్రభుత్వ భూములు [illegible] ఆక్రమించుకున్న వారిపైన రెవెన్యూ యంత్రాంగం ఎలాంటి కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. పేదలు ఒక ఎకరా సాగు చేయడానికి పోతే ట్రాక్టర్లు ఆపడం పోలీసుల చేత కేసులు నమోదు చేయించడం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు సుబ్బమ్మ, చిన్నక్క, దాసరి ప్రశాంతి, భాగ్యమ్మ, సరోజ, వెంకటమ్మ పాల్గొన్నారు.



రెవెన్యూ కార్యాలయంలో వినతిపత్రమిస్తున్న వి.అన్వేష్



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో డైరెక్టర్, ఎఒ

ముగ్గురు విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - వేంపల్లె

ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో చదివిన ముగ్గురు విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు వచ్చినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులను బుధవారం ఇడుపులపాయ క్యాంపస్‌లో డైరెక్టర్, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, డీన్ అకాడమిక్ రత్నకుమారి అభినందించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటిలో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసుకున్న పి.నిహారిక, బి.ఉదయ్, కె.హేమంత్ అనే విద్యార్థులకు హ్యుందాయ్ మోటర్ ఇండియా ఆర్అండ్‌డి విభాగంలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ (ట్రైనీ)లుగా నియమితులైనట్లు చెప్పారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఏడాదికి జీతం రూ.5.5 లక్షలు అన్నారు. మార్చి నెలలో ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో జరిగిన ప్రాంగణ ఎంపిక ద్వారా ఇంటర్న్ షిప్ సాధించిన తర్వాత గెట్‌గా నియమితులైనట్లు తెలిపారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కొండారెడ్డి, ప్లేస్‌మెంట్ అధికారి సుందర్, ప్లేస్ మెంట్ సమన్వయ కర్త వినోద్‌కుమార్, మెకానికల్ ఇంజనీరింగ్ రమేష్, పిఆర్‌ఓ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు బైపాస్ సమీపంలో ఉన్న పెన్నా నదిలో నుండి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతోందని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కరుణాకర్ యాదవ్ బుధవారం పత్రికలకు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయం ప్రొద్దుటూరులో బహిరంగమైనప్పటికీ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు గాని ఎలాంటి కట్టడి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా కొంత మంది అదే పనిగా ఇసుక వ్యాపారం చేస్తున్నారు. విచ్చల విడిగా ట్రాక్టర్లు ఏర్పాటు చేసుకొని ఇసుకను తోలుతూ అక్కడి నుండి టిప్పర్ల ద్వారా ఆళ్లగడ్డ, నంద్యాల, మార్కాపురం తదితర దూర ప్రాంతాలకు అక్రమ రవాణా చేస్తున్నారన్నారు. అధికార పార్టీ అండదండలతో ఇసుకను అక్రమ రవాణా చేస్తూ భూగర్భ జలాలను అడుగంటిస్తున్నారన్నారు. అవినీతి ప్రక్షాళన దిశగా అడుగులేస్తున్న కలెక్టర్, ఎస్పీ ప్రొద్దుటూరు ఇసుక మాఫియాపై ఉక్కు పాదం మోపి అక్రమ రవాణాకు సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని కరుణాకర్ యాదవ్ కోరారు.

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలని, అలాగే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి, ఎస్పి హర్షవర్ధన్‌రాజు సంయుక్తంగా అధికారులను ఆదేశించారు. బుధవారం కడప పోలీస్ పెరేడ్ మైదానంలో ఆగస్టు 15న నిర్వహించే 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణలో భాగంగా భద్రత, బందోబస్తు, పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు తదితరాలపై వారు సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటికీ జెండా ఆవిష్కరణ ఫొటోలు, వీడియోలను ఆఫీసియల్ పోర్టల్‌లో అప్ లోడ్ చేయాలన్నారు. వేడుకల్లో భాగంగా జాతీయ పతాక ఆవిష్కరణ, తదితర వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు కల్పించాల్సిన సీటింగ్, ప్రతిభా పురస్కారాలు అందుకునే అధికారులు, సిబ్బంది జాబితా, సాంస్కృతిక కార్యక్రమాలు, డాగ్‌షో, ఫైర్ సిబ్బంది విన్యాసం, వివిధ శాఖల ప్రగతి రథాల ప్రదర్శన, స్టాల్స్ ఏర్పాటు, ఫొటో షూట్, స్నాక్స్, డ్రింకింగ్ వాటర్ మొదలైనవి సౌకర్యాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఏర్పాట్లతో ఎటువంటి అసౌకర్యం లేకుండా సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్‌కు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జెసి అదితి సింగ్, ఎఎస్‌పిలు, ఆర్‌డిఒ వెంకటపతి, కృష్ణారావు, సుధాకర్, కెఎంసి కమిషనర్ నందన్ పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న కడప కలెక్టర్, ఎస్‌పి

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలి

- ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా

ప్రజాశక్తి - బద్వేలు

వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి. చాంద్‌బాషా పేర్కొన్నారు. స్థానిక ఆవాజ్ కార్యాలయంలో ఆవాజ్‌కమిటీ ఆధ్వర్యంలో కరపత్రం విడుదల చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత దేశంలో ముస్లిం, మైనార్టీల పైన దాడులు అధికమయ్యాయని, వారం కిందట కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో వక్ బోర్డ్ చట్టాన్ని సవరిస్తూ 40 ప్రతిపాదనలు చేశారని, ఈ చట్ట సవరణ చాలా దారుణమైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బిల్లును జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపినారని, ఈ బిల్లు ద్వారా ముస్లిమేతరులు కూడా వక్ఫ్ పాలక మండలిలో సభ్యులుగా ఉండాలనే నిబంధన పెడుతున్నారని, ఇది మత స్వేచ్ఛపై ప్రత్యక్ష దాడిగా భావించాలని పేర్కొన్నారు. విద్వేషపూరిత, రాజ్యాంగ వ్యతిరేక వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్రం పూర్తిగా ఉపసంహరించుకునేలా అటు పార్లమెంటులనూ, పార్లమెంటు వెలుపల ప్రజాక్షేత్రంలోనూ విశాల ఐక్యతతో లౌకిక ప్రజాతంత్ర శక్తులు ఉద్యమించడం అవసరమని చెప్పారు. ముస్లిములు ధార్మిక ప్రయోజనాల కోసం అంకితం చేసిన స్థిర, చరాస్తులను వక్ఫ్ ఆస్తులు అంటారని, వక్ఫ్ ఆస్తిని ఎవరికీ అమ్మడం లేదా బదలాయించడం కుదరదని వివరించారు. వక్ఫ్ నుంచి వచ్చే ఆదాయం సాధారణంగా విద్యా సంస్థలు, శ్మశాన వాటికలు, మసీదులు, షెల్టర్ హోమ్ వంటివాటి నిర్వహణకు ఉపయోగిస్తారని వెల్లడించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణకు ప్రభుత్వాలు నామినేట్ చేసిన సభ్యులతో కూడిన చట్టబద్ధమైన సంస్థ వక్ఫ్ బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. బోర్డు ప్రతి ఆస్తికి ఒక కస్టోడియన్‌ను నియమిస్తుందని, దాని ద్వారా వచ్చే ఆదాయాన్ని ఉద్దేశిత ప్రయోజనాలకు ఉపయోగించేలా చూస్తుందన్నారు. 1964లో ఏర్పాటు చేసిన సెంట్రల్ వక్ఫ్ కౌన్సిల్ దేశమంతటా 9.4 లక్షల ఎకరాలు భూములు కలిగిన మూడవ అతిపెద్ద సంస్థ గా వక్ఫ్ బోర్డు ఉందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 70 వేల ఎకరాలు వక్ఫ్ భూములు ఉన్నవి, ఇందులో 31 వేల ఎకరాలు కబ్జా అయినదని, ఈ భూములు కొనడం అమ్మడం చట్ట ప్రకారం నేరమని తెలిసినా స్వార్థపరులు కబ్జాలు చేసి అమ్ముతున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వ్యతిరేకించాలని గుంటూరు నగరంలో రాష్ట్ర సదస్సు ఈనెల 18న గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహిస్తారని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బద్వేల్ ఆవాజ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు అబ్దుల్ సత్తార్, అన్వర్‌బాషా, నాయకులు కె.బి రసూల్, ఎస్. రహీం, ఎస్.షబ్బీర్, ఎస్.మహమ్మద్ అలీ, నాగూర్ పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆవాజ్ నాయకులు


సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

అర్జీదారులకు సత్వర పరిష్కారం

రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి బాధితులకు సత్వర పరిష్కారం చూపడం జరుగుతోందని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులకు తెలియజేసి బాధితుల సమస్యను పరిష్కరిస్తున్నామన్నారు. అధికారులు పేదల సమస్యలు గుర్తించి వెంటనే పరిష్కరించాలన్నారు. గతంలో ఎంతో వెనుకబడి ఉన్న రాయచోటి నియోజకవర్గం నేడు అన్ని రంగాలలో అభివద్ధి చెందేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలు అప్పటికప్పుడే పరిష్కరిస్తున్నామని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై మంత్రికి అర్జీలు సమర్పించారు.

ఆలయ స్థలం ఆక్రమణ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పట్టణంలోని నీరుగట్టువారిపల్లి, రామిరెడ్డి లేఅవుట్‌లో వెలసిన శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయ స్థలాన్ని దేవస్థానం ప్రక్క ఇంటివారు అక్రమంగా ప్రవేశిస్తున్నారని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి చెందిన భూమిలో తాము భక్తుల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇప్పటీకే రూ.60 వేలు ఖర్చు చేసి నిర్మాణ పనులు చేశామన్నారు. దీనిపై పక్కన నివాసం ఉండేవారు ఆ స్థలం మాకు చెందుతుందని పలుమార్లు మాపై దురాషేలాడి, గొడవలకు దిగుతున్నారన్నారు. ఈ విషయంపై ఆలయ కమిటీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఆ స్థలం ఆలయం పేరిట రిజిస్టర్ అయిందని, అవసరమైతే సర్వేయర్, రెవిన్యూ అధికారులతో సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా కోరడం జరిగిందన్నారు. ఈ విషయంలో ఇప్పటికే పోలీసు వారు ఒకసారి ఇక్కడికి వచ్చి రెవెన్యూ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారన్నారు. అయితే వారి ఆదేశాలను ఆ ఇంటివారు భేఖాతరు చేస్తూ పనులు ప్రారంభించారని తెలిపారు. కావున పోలీసు, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని ఆలయ భూమిని కాపాడీ భక్తులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.


మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన పోలీస్ పెరేడ్ మైదానం
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి



స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముస్తాబైన పెరేడ్ మైదానం

ప్రజాశక్తి - రాయచోటి

78వ భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానం ముస్తాబైంది. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని పోలీస్ పెరేడ్ మైదానంలో భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా కనుల పండువుగా ఉదయం 8.35 వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తి చేశారు. కలెక్టరేట్, ఎస్‌పి కార్యాలయాలు ఈ సందర్భంగా ముస్తాబయ్యాయి. మంత్రి మండి పల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంఎల్‌ఎలు, కలెక్టర్, ఎస్‌పి తదితర ఉన్నతాధికారులచే మూడవ సారి జెండా ఎగురవేయనున్నారు. వివిధ శాఖల శకటాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు రంగరంగ వైభవంగా నిర్వహించేలా సన్నాహాలు చేస్తున్నారు.

వేడుకల ఏర్పాట్ల పరిశీలన

స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పెరేడ్ గ్రౌండ్ సిద్ధమైంది. బుధవారం వేర్వేరుగా కలెక్టర్ శ్రీధర్, ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పోలీసుల కవాతు రిహార్సల్స్, భద్రత, బందోబస్తు ఏర్పాట్లును తనిఖీ చేశారు. అనంతరం కవాతు పరిశీలన వాహనంలో వెళ్లి సాయుధ పోలీసు బలగాల పరేడ్ ప్రదర్శన పరిశీలించి కవాతును నిర్వహించడంలో కొన్ని సూచనలు, మెలకువలు సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు మరింత ఉత్సాహంగా కవాతు ప్రదర్శన చేయాలని పేర్కొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవ రోజున జాతీయ పతాక ఆవిష్కరణ, పోలీస్ కవాతు, శకటాల ప్రదర్శన, తదితర వేడుకలను తిలకించేందుకు వస్తున్నా రాజకీయ ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు కల్పించాల్సిన భద్రత ఏర్పాట్లును సమీక్షించి, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వాహనాల పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు ఎస్‌పి పలు సూచలను చేశారు.


పెరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీధర్



మంత్రి లోకేష్‌తో మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పార్టీ కోసం పనిచేసిన వారికి నామినేటెడ్ పదవుల్లో స్థానం కల్పించాలని డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి కోరారు. బుధవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో మంత్రి నారా లోకేష్‌ను ఆయన కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలపై నమోదైన అక్రమ కేసుల నుంచి విముక్తి కలిగించాలని లోకేష్‌ను కోరారు. మాజీ ఎమ్మెల్యే రాచమల్లు అవినీతి, అరాచక పాలనపై విచారణ చేయించాలని, నందం సుబ్బయ్య హత్య కేసులో నిజమైన దోషులను కఠినంగా శిక్షించాలని మంత్రి లోకేష్‌కు వినతిపత్రమిచ్చారు. ప్రొద్దుటూరులో ప్రస్తుత పరిస్థితులపై చర్చించామన్నారు. మంత్రి లోకేష్ స్పందిస్తూ ప్రతి విషయాన్ని పరిశీలించి కార్యకర్తలకు న్యాయం చేస్తామని తెలిపారన్నారు.

ఫీజు కట్టకుంటే ఇంటికే..!

- చిన్నారిపై స్కూల్ యాజమాన్యం దురుసు ప్రవర్తన

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

పట్టణానికి చెందిన ఓ ప్రయివేట్ ప్రాథమికోన్నత పాఠశాలలో యుకెజి చదువుతున్న ఓ అబ్బాయి ఫీజు చెల్లించలేదని ఏకంగా ఇంటికే పంపిన ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. రామేశ్వరానికి చెందిన శాంతి కుమారివీధికి పోయే దారిలో ఉన్న జవహర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నాలుగేండ్ల అబ్బాయి యుకెజి చదువుతున్నాడు. రోజూలాగే మంగళవారం కూడా స్కూల్‌కు వెళ్లాడు. వెళ్లిన కొద్ది సేపటికే అబ్బాయి ఇంటికి రావడంతో తల్లి కారణమేంటని ఆరా తీయగా.. రూ.2,500 ఫీజ్ చెల్లించకపోవడంతో స్కూల్ యాజ మాన్యం నిర్దాక్షిణ్యంగా పాపం పుణ్యం ఎరుగని ఆ పసి బాలుడిని ఇంటికి పంపినట్లు తెలిసింది. అంతలో తల్లి స్కూల్‌కు వెళ్లి విచారించగా తల్లిపైన కూడా యాజమాన్యం దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. పట్టణంలో ప్రయివేట్ పాఠశాలలు వందల సంఖ్యలో ఉన్నాయి. ఏ పాఠశాల కూడా ప్రభుత్వ నిబం ధనలు పాటించకుండా ఇష్టారీతిన పాఠశాలలు నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. విద్యాహక్కు చట్ట నిబంధనలు పాటించడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. నిబంధనల మేరకు 25శాతం పేదపిల్లలకు ఉచిత విద్యనందించాలి. అంటే పాఠ శాలకున్న పిల్లల సంఖ్యలో 25శాతం ఉచిత విద్య ఏ పాఠశాలలో అమలు కావడంలేదు. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవలసిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రొద్దుటూరు మండలానికి ఇరువురు మహిళా అధికారులు ఎంఇఒలుగా ఉన్నారు. పాఠశాల సమస్యలపై వారి కార్యాల యానికి వెళ్లి వివరణ కోసం యత్నించగా.. ఇరువురు మహిళా అధికారులు మెడికల్ లీవ్‌పై వెళ్లినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉన్న ఇరువురు మహిళా అధికారులకు ఒకేసారి మెడికల్ లీవ్ ఎలా మంజూరు చేస్తారని పిల్లల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్థానిక విద్యావ్యవస్థపై దృష్టి పెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

18న పుస్తకావిష్కరణలు

ప్రజాశక్తి -కడప అర్బన్

రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు ఎం.సి నాగిరెడ్డి రచించిన 'శతక మధురిమలు' 'బంధాలు - బాధ్యతలు' అనే రెండు పుస్తకాలను ఈనెల 18న ఉదయం 9.30 గంటలకు శ్రీ రామకృష్ణ వానప్రస్థాశ్రమంలో ఆవిష్కరిస్తున్నట్లు వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సినీ నిర్మాత కె.బాబు రెడ్డి, విశిష్ట అతిథిగా రాయలసీమ గ్రామీణ బ్యాంకు రిటైర్డ్ మేనేజర్ జి. వెంకటసుబ్బారెడ్డి, శతక మధురిమలు పుస్తక సమీక్షకులుగా డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, బంధాలు - బాంధవ్యాలు పుస్తక సమీక్ష కులుగా డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఆత్మీయ అతిథులుగా వానప్రస్థాశ్రమం కార్యదర్శి జి. సుబ్బిరెడ్డి, కోశాధికారి బి. శివరామిరెడ్డి, సభా సమన్వయకర్తగా జిల్లా రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి హాజరు కానున్నారని పేర్కొన్నారు.

వైద్యురాలి హత్య బాధాకరం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పశ్చిమ బెంగాల్ కలకత్తాలోని మహిళా జూనియర్ డాక్టర్ అత్యాచారం ఘటనపై ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో భారత విద్యార్థి ఫెడరేషన్, భారత ప్రజాతంత్ర యువజన సమైక్య ఆధ్వర్యంలో జూనియర్ డాక్టర్లులు ప్లకార్డ్ చేబూని నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం డేవిడ్‌రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కలకత్తాలోని ప్రముఖ ప్రభుత్వ సంస్థ అయినా ఆర్‌జికార్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో దారుణ అత్యా చారం జరిగిందన్నారు. హాస్పిటల్‌లో జూనియర్ డాక్టర్ 36 గంటల షిఫ్ట్‌లో ఉండగా తెల్లవారుజామున 2 గంటల వరకు విధులు హాజరై తర్వాత ఆమె రాత్రి భోజనం చేసి సెమినార్ హాల్లో చదువుకోవడానికి కూర్చుందన్నారు. అనంతరం ఆ వైద్యురాలి తన సొంత డిపార్ట్మెంట్లోనే ఉన్న వ్యక్తి దారుణంగా హత్య చేసి, అత్యాచారానికి పాల్పడ్డారన్నారు. ఆ జూనియర్ డాక్టర్‌కు న్యాయం చేకూరాలని, వారి కుటుంబానికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో హర్షవర్ధన్, అహ్మద్, పవన్ కుమార్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

నెల్లూరు జట్టుపై పశ్చిమగోదావరి విజయం

ప్రజాశక్తి - కడప

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ అండర్ 19 గ్రూప్ బి అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా కెఒఆర్ఎం క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో నెల్లూరు జట్టుపై 38 పరుగుల తేడాతో వెస్ట్ గోదావరి జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో మొదటి ఇన్నింగ్స్‌లో నెల్లూరు జట్టు 122 పరుగులు చేసింది. ఐదు వికెట్ల నష్టానికి 268 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన వెస్ట్ గోదావరి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 81.3 ఓవర్లలో 340 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని రేవంత్ నాగ కుమార్ 133 పరుగులు (సెంచరీ) చేశాడు. నెల్లూరు జట్టులోని ఎన్ లోకేష్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. డి. మోహన్ 2, ఎస్. ఎస్. హమీద్ 2 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 42.0 ఓవర్లలో 180 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయి ఓటమి చెందింది. ఆ జట్టులోని మన్విత్ రెడ్డి 42, ఎన్. లోకేష్ 40 పరుగులు చేశారు. వెస్ట్ గోదావరి జట్టులోని డి. యశ్వంత్ 2, హర్షవర్ధన్ 2, రేవంత్ నాగ కుమార్ 2, మెహబూబ్ 2 వికెట్లు తీసుకున్నారు.

వై.ఎస్.రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో జరుగుతున్న మ్యాచ్‌లో విశాఖపట్నం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 480 పరుగుల భారీ స్కోరు చేసింది. నాలుగు వికెట్ల నష్టానికి 356 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన విశాఖపట్నం జట్టు 132.5 ఓవర్లలో 480 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని బి. యశ్వంత్ 72, ఏ. దేవా శిష్ 72 పరుగులు చేశారు. కష్టా జట్టులోని ఆదర్శ్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 5 వికెట్లు తీసుకున్నాడు. రాజేష్ 3 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కష్టా జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 40.0 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ఆ జట్టులోని ధనుష్ 38, వరుణ్ సాత్విక్ 37 పరుగులు చేశారు. విశాఖపట్నం జట్టులోని ఎం. యువన్ 2, ఎస్.వి.ఎస్.జె. రోహిత్ 2 వికెట్లు తీసుకున్నారు.

కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగుతోంది. మొదటి 7 వికెట్లు నష్టానికి 293 పరుగుల ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు తన మొదటి ఇన్నింగ్స్‌లో 116.0 ఓవర్లలో 365 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని డి. బాలాజీ 79 (నాటౌట్) పరుగులు చేశాడు. కడప జట్టులోని నాగ కుల్లాయప్ప అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 6 వికెట్లు తీసుకున్నాడు జెహెచ్ రెడ్డి 2 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 63.0 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 324 పరుగులు చేసింది. ఆ జట్టులోని ఆర్. రోహిత్ వర్మ బ్యాటింగ్లో అద్భుతంగా రాణించాడు. 149 బంతులను ఎదుర్కొని 31 బౌండరీలు, 4 సిక్సర్ల సహాయంతో 194 పరుగులు (సెంచరీ) చేశాడు. డి. రణధీర్ రెడ్డి 83 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి హర్షిత్ రెడ్డి మూడు వికెట్లు తీసుకున్నాడు.



ఐదు వికెట్లు తీసుకున్న ఆదర్శ్



ఆరు వికెట్లు తీసుకున్న నాగకుల్లాయప్ప



133 పరుగులు చేసిన రేవంత్ నాగకుమార్



194 పరుగులు చేసిన రోహిత్‌వర్మ

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలి



ర్యాలీలో భూపేష్‌రెడ్డి, ఆర్డీఒ, డిఎస్పీ, అధికారులు, విద్యార్థులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దేశాభివృద్ధిలో యువత భాగస్వామ్యం కావాలని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి, ఆర్డీఓ శ్రీనివాసులు సూచించారు. పట్టణంలో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా బుధవారం హర్ ఘర్ తిరంగా జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ జమ్మలమడుగు పురవీధుల్లో తిరిగారు. దేశ స్వాతంత్ర ఐక్యతను చాటిచెప్పారు. ముందుగా ఎస్పీ డిగ్రీ కాలేజ్ ఎన్‌సిసి విద్యార్థులు, జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తూ కవాతు నిర్వ హించారు. ర్యాలీలో ప్రభుత్వ, ప్రయివేట్, పాఠశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్ర సమర యోధులను స్మరించడం మన బాధ్యత అన్నారు. భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ దేశ ఖ్యాతిని నలుమూలల విద్యార్థులు విస్తరింపజేయాలని, ఉన్నత చదువులతో దేశానికి సేవ చేయడం ఆశయంగా కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు దారిపొడవునా టిడిపి యువనేత జింకల మహబూబ్ బాషా వాటర్ ప్యాకెట్లను అందజేశారు. పాత బస్టాండ్ కూడలి నుండి, మార్కెట్, అంబా భవాని, సంజామల మోటు, పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. జమ్మలమడుగు డిఎస్పీ హుస్సేన్ పీరా నేతృత్వంలో పోలీసులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో డిఎస్పి హుస్సేన్ పీరా, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, జనసేన జమ్మలమడుగు కో -ఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున, మెప్మా అధికారి గంగులయ్య, అసెంబ్లీ కన్వీనర్ జొల్లు కొండయ్య, వంగల నాగేంద్ర యాదవ్, టిడిపి ఎస్సీ సెల్ నాయకులు బిర్రు సంతోష్, రాజారెడ్డి, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ ప్రదానోత్సవం

ప్రజాశక్తి - కడప :78వ భారత స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేద్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ ప్రదానోత్సవం పథకం ద్వారా 5, 6, 7, 8, 9 , 10వ తరగతుల్లో ప్రతిభ కనపరిచిన ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థినులకు బుధవారం స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కెనరా బ్యాంక్ కడప ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని శాఖల ద్వారా 294 మంది విద్యార్థినులకు రూ.11,76,000ను పంపిణీ చేశారు. కార్యక్రమానికి సంబంధి ంచిన చెక్కును కెనరా బ్యాంకు కడప ప్రాంతీయ కా ర్యాలయాధికారి మురళీ మోహన్, కలెక్టర్ శివశంకర్ లోతేటి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కెనరా బ్యాంక్ వారు దేశ వ్యాప్తంగా ప్రతి సంవత్సరమూ నిర్వహించే వివిధ సామాజిక సేవలను జిల్లా కలెక్టరుకు వివరించారు. కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ రమేష్, ఎల్‌డిఎం జి.జనార్దనం పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న బ్యాంక్ అధికారులు

బాగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలి



స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్న ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి - కడప అర్బన్

పోలీస్ కుటుంబాల పిల్లలు బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు ఆకాంక్షించారు. బుధవారం స్థానిక పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసుల, హోమ్‌గార్డ్స్ కుటుంబాలకు చెందిన 59 మంది పిల్లలకు విద్యలో ప్రతిభ కనబరచి టెన్త్, ఇంటర్‌లో 90 శాతం పైబడి మార్కులు సాధించిన వారికి మెరిట్ స్కాలర్ షిప్‌లను, ప్రశంసా పత్రాలను అందచేసి అందరిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భవిష్యత్తులో మనసుకు నచ్చిన, మీరు ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. జీవితంలో ఇంటర్ దశ చాలా కీలకమైందని, క్రమశిక్షణతో ఉన్నత స్థాయికి ఎదగడం ఛాలెంజ్ లాంటిదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు అహర్నిశలు శ్రమించి, త్యాగాలు చేసి చదివిస్తున్నారని మనసులో ఉంచుకుని, అడ్డంకులను అధిగమించి లక్ష్యాలను సాధించే దిశగా శ్రమించాలని సూచించారు. పోలీస్ కుటుంబాలకు చెందిన ఐఐటి, ఎన్‌ఐటిలలో విద్యను అభ్యసించి పలువురు అత్యున్నత స్థాయిలో ఉండటం సంతోషంగా ఉందని చెప్పారు. పలువురు ఆల్ ఇండియా సర్వీస్ అధికారులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఒత్తిడిని దరిచేరనీయవద్దని, సమస్యలు వస్తే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, సన్నిహితులతో పంచుకోవాలని, వారు సమస్యలు పరిష్కారమయ్యేలా తగిన సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. సమావేశంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) లోసారి సుధాకర్, అదనపు ఎస్‌పి కష్ణారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యు. వెంకటకుమార్, ఆర్ఐ టైటస్, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్, హోమ్‌గార్డ్స్ కుటుంబాల చిన్నారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

19న ఫొటో ఎగ్జిబిషన్

ప్రజాశక్తి కడప అర్బన్ : అంతర్జాతీయ 185వ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19వ తేదిన ఫొటోల ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు ఎ.వెంకట సుబ్బయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు, ఏపీ ఫోటో వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. సంస్థ కార్యాలయంలో బుధవారం ప్రదర్శనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను వారు విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలో ఫోటోల ప్రదర్శన ఉంటుందని వివరించారు. జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు.

'మను' పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిజ్ఞ

ప్రజాశక్తి కడప అర్బన్ :నగర శివారులో ఉన్న మౌలానా అజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ పాలిటెక్నిక్ కళాశాలలో 'మాదకద్రవ్యాల రహిత దేశంగా భారత్' అనే అంశంపై బుధవారం విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా వెల్ఫేర్ అండ్ డిఫరెంట్ ఏబుల్డ్ ఎడిఆర్. వి. కృష్ణ కిషోర్ హాజరయ్యారు. విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే హాని గురించి వివరించారు. కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ మిర్జా విలాయత్ అలీ బేగ్ మాట్లాడుతూ యువత మంచి మార్గాన్ని ఎంచుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు దేశానికి మేలు చేసిన వారు అవుతారని హిత బోధన చేశారు. సదస్సులో జిల్లా డి అడిక్షన్ సెంటర్ సూపరింటెండెంట్ అనిల్ సౌమ్య, కళాశాల సిబ్బంది డాక్టర్ హకీముద్దీన్, మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్య దారుణం

ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి



జూడాల ఆందోళనకు సంఘీభావం తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

కలకత్తా ఆర్‌జికార్ కళాశాలలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అత్యాచారాన్ని నిరసిస్తూ రిమ్స్ జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనకు ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగురవి మాట్లాడుతూ జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం ఘటనకు సంబంధించి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. బాధ్యుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. డాక్టర్లకే భద్రత లేకుంటే సాధారణ మహిళల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. దేశంలో ఏదో ఒకచోట ఇలాంటి చోటు చేసుకుంటున్నాయన్నారు. పోర్న్ సైట్లను తక్షణమే బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకి రక్షణ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఈ విధంగా అత్యాచారాలు జరిగితే భవిష్యత్తులో కనీస వైద్యానికి సంబంధించి విద్యార్థులు చదివేందుకు భయభ్రాంతులకు గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపైన ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి అన్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడితామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర నాయకులు యశ్వంత్, అభి, లోకేష్, వినోద్ పాల్గొన్నారు.

డ్రమ్ సీడర్ విధానంతో అధిక ప్రయోజనాలు



రైతులకు సూచనలిస్తున్న ఎఒ సురేష్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - కడప సిటీ

డ్రమ్ సీడర్ విధానంతో అధిక ప్రయోజనాలున్నాయని కడప వ్యవసాయశాఖ ఎఒ సురేష్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన కడప మండలంలోని పాలంపల్లిలోని రమణమూర్తి అనే రైతు వ్యవసాయ పొలాన్ని పరిశీలిచారు అనంతరం ఆయన డ్రమ్ సీడర్ పద్ధతిలో వరి సాగు ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిచారు. డ్రమ్ సిడర్ విధానంలో ఎనిమిది నుంచి పది కిలోల విత్తనంతో రెండు నుంచి మూడెకరాలను నాటుకోవచ్చని తెలిపారు. తద్వారా కూలీల ఖర్చులు తగ్గతాయన్నారు. దీనికితోడు పది. రోజులు ముందుగానే పంత కోతకు వస్తుందన్నారు. దీనికితోడు మూడు నుంచి నాలుగు బస్తాల దిగుబడి పెరుగుతుందని చెప్పారు. అనంతరం గొర్రు ద్వారా సాగు చేసిన పొలాల్ని సైతం పరిశీలిచారు. కార్యక్రమంలో ఎఇలు మెహతాజ్, పావని పాల్గొన్నారు

లక్ష్యంపై దృష్టి సారించాలి : విసి

ప్రజాశక్తి- కడప అర్బన్

విద్యార్థులు బాగా చదివి భవిష్యత్తు లక్ష్యంపై దృష్టి సారించాలని వైవీయూ విసి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం శ్రీ వివేకానంద మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ సమాజం బాగుండాలంటే మహిళలు విద్యా, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని తెలిపారు. ఉన్నత శిఖరాలను చేరుకోవాలని కోరిక క్రమశిక్షణ, అంకిత భావం, పట్టుదలతోనే సాధ్యమవుతుందని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎన్.పి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులకు నైతిక విలువలు పెరగాలని తెలిపారు. ఎంపిక చేసుకున్న రంగంలో పూర్తిస్థాయి నైపుణ్యతను సాధించి అందులో రాణించాలని పేర్కొన్నారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడ్, అటానమస్ హోదా రావడం పట్ల విసి యాజమాన్యాన్ని అభినందించారు. బోర్డ్ ఆఫ్ స్టడీస్ – కోర్సు స్ట్రక్చర్ అండ్ సిలబస్ అకాడమిక్ క్యాలెండర్‌ను విసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, డెమో, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అకాడమిక్ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న విసి



రిహార్సల్స్‌ను పరిశీలిస్తున్న ఎస్‌పి

పెరేడ్ రిహార్సల్స్‌ను పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్

ఆగస్టు 15న ఘనంగా జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల పోలీసుల రియల్ టైం ఫుల్ డ్రెస్ కవాతు రిహార్సల్స్‌ను కడప నగరంలోని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో బుధవారం నిర్వహించారు. రియల్ టైమ్ ఫుల్ డ్రెస్ రిహార్సల్‌లో భాగంగా ఎస్‌పి వి.హర్షవర్ధన్ రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి జెండాకు వందనం చేశారు. అనంతరం కవాతు రియల్ టైం ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌ను పరిశీలించారు. సిబ్బంది గౌరవ వందనం స్వీకరించారు. పోలీసుల, హోంగార్డ్స్‌తో పాటు ఎన్‌సిసి, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల కవాతును పరిశీలించారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు విచ్చేయనున్న ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు గ్యాలరీల ఏర్పాటు, కల్పించాల్సిన భద్రత ఏర్పాట్లను, సౌకర్యాలను పరిశీలించారు. పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఆదేశించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి (అడ్మిన్) లోసారి సుధాకర్, అడిషనల్ ఎస్‌పి ఏ.ఆర్ ఎస్.ఎస్.వి కష్ణారావు, ఎఆర్ డిఎస్‌పి మురళీధర్, ఆర్‌ఐలు ఆనంద్,వీరేష్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

రూ.10 నాణేలు చెల్లుబాటు అవుతాయి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

రిజర్వ్ బ్యాంక్ విడుదల చేసిన 14 రకాల రూ.10 నాణేలన్ని చెల్లుబాటు అవుతాయని కలెక్టర్ శివ శంకర్ లోతేటి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రూ.10 నాణేల అవగాహన కోసం డిసిసి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి, కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ కె మురళీ మోహన్ తో కలసి 7 రోడ్ల కూడలిలో ఈనెల 16న పెద్ద ఎత్తున రూ.10 నాణేలపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. రూ.10 నాణెం చెల్లుబాటుపై క్లారిటీ ఇచ్చారు. గతంలో కూడా ప్రజల్లో రూ10 నాణేల చెల్లుబాటుపై అయోమయం నెలకొన్నప్పుడు ఆర్‌బిఐ అధికారికంగా ప్రకటించిందన్నారు. అన్ని జాతీయ బ్యాంకులు కూడా నాణేలపై ప్రజల సందేహాలను తీర్చినప్పటికీ రూ.10 నాణెం చెల్లదనే అనుమానాలు సామాన్యుల్లో, వ్యాపారులు, దుకాణదారులు, షాపుల నిర్వాహకుల్లో ఉన్నాయని తెలిపారు. ఈ అయోమయానికి తెరదించుతూ రూ.10 నాణెం చెల్లుబాటుఅవుతుందని పేర్కొన్నారు. సంకోచం లేకుండా అన్ని లావాదేవీలలో నాణేలను వినియోగించవచ్చునని తెలిపారు.

జర్నలిస్టుల మృతి బాధాకరం

ప్రజాశక్తి-కడప అర్బన్

నిరంతరం ఒత్తిడితోనే జీవితం సాగిస్తూ జర్నలిస్టులు తనువు చాలిస్తున్నారని జర్నలిస్టుల సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కడప ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మతిచెందిన జర్నలిస్టులకు ఘన నివాళలర్పించారు. అనంతపురం కెమెరామెన్ శేఖర్ ఆర్థిక సమస్యలతో తన కుమార్తెకు ఉరివేసి తాను కూడా ఉరివేసుకున్న సంఘటన మరువకముందే తెలంగాణ జర్నలిస్టు యోగి రెడ్డి మతి బాధాకరమని పేర్కొన్నారు. కడప జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బెల్లం రాజు ఆధ్వర్యంలో ఈ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నిరంతరం ఒత్తిడికి గురవుతూ చనిపోతున్న జర్నలిస్టులను, వారి కుటుంబాలను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రిపోర్టర్లు, కెమెరామెన్లు పాల్గొన్నారు.


స్వాతంత్ర దినోత్సవం మరియు ప్రజాశక్తి దినపత్రిక
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
44వ
వార్షికోత్సవం
ప్రజలకు, అధికారులకు, ప్రజాప్రతినిధులకు, ఉపాధ్యాయినీ
ఉపాధ్యాయులకు, విద్యార్థినీ విద్యార్థులకు మరియు బంధుమిత్రులకు
స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో ప్రజాశ్రేయస్సే పరమావధిగా, కార్యవర్గ,
ప్రజాగొంతుకై నినదిస్తూ వాస్తవాలను వెలుగులోకి తెస్తూ, నినదిస్తూ నేడు 44వ వసంతంలోకి
అడుగిడుతున్న ప్రజాశక్తి దినపత్రిక విలేకరులకు, సిబ్బందికి శుభాకాంక్షలు...
LITTLE FLOWER EM SCHOOL T.SUNDUPALLI
లిటిల్ ఫ్లవర్
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తించబడిన సంస్థ)
ఇంగ్లీష్ & తెలుగు మీడియం హైస్కూల్
L.K.G. నుండి 10 వ తరగతి వరకు
రాయల్ స్ట్రీట్, శ్రీరామకృష్ణాపురం, పీలేరు రోడ్డు, టి.సుండుపల్లి.
ఆహా అనిపించే "మహా" విజయం యస్.యస్.సి. ఫలితాలలో అద్భుత ఫలితాలు సాధించిన మా ఆణిముత్యాలు
సెల్: 8790962369, 9440855499
500 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు: ఒకరు, ఇద్దరు, ముగ్గురు కాదు 13 మంది..... విద్యార్థులు
100% విద్యార్థులు 400 పైబడి మార్కులు సాధించిన ఏకైక విద్యా సంస్థ.
2023-24 యస్.యస్.సి. ఫలితాలలో మా విద్యార్థుల ప్రభంజనం
569 600 H.T.No. 2423105401
568 600 H.T.No.2423104983
561 600 H.T.No.2423105221
538 525 522 520 517 514 513
505 504 502 497 495 495 493
485 485 472 470 469 465 464
451 440 439 424 424 414 413 405
100%
తరగతులు ప్రారంభం:12-6-2024
అడ్మిషన్లు జరుగుచున్నవి
సదా మీ సేవలో...


స్వాతంత్ర దినోత్సవ మరియు ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మీ మేధస్సుకు శ్రీమేధ తోడైతే... మీ భవిష్యత్తు బంగారు బాట
JR. MPC 462/470
JR. BiPC 420/440
JR. CEC 439/500
SR. MPC 972/1000
SR. CEC 956/1000
ఎంతో మందిని ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తయారు చేసిన అపార అనుభవం, అర్హత,
అంకితభావం కల్గిన అధ్యాపక బృందం ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఏకైక కళాశాల
శ్రీమేధ
జూనియర్ కాలేజ్ - పీలేరు
(ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వముచే గుర్తింపు పొందిన సంస్థ)
ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, చెన్నారెడ్డి వీధి, పీలేరు - 517 214


స్వాతంత్ర దినోత్సవ మరియు ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
మండల ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు,
మిత్రులకు స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...
ప్రతి అక్షరం-ప్రజల పక్షం అనే నినాదంతో ప్రజాగొంతుకై
నినదిస్తూ వాస్తవాలను వెలుగులోకి తెస్తూ, నినదిస్తూ
నేడు 44వ వసంతంలోకి
అడుగిడుతున్న ప్రజాశక్తి దినపత్రిక
విలేకరులకు, సిబ్బందికి
శుభాకాంక్షలు...
పత్తి సుబ్బరాయుడు
గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఒంటిమిట్ట.


స్వాతంత్ర దినోత్సవ మరియు ప్రజాశక్తి 44వ
వార్షికోత్సవ
శుభాకాంక్షలు
44వ
వార్షికోత్సవం
ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం వార్తా కథనాలను వ్రాస్తూ...
నిజాలను నిర్భయంగా వ్రాసే పత్రిక ప్రజాశక్తి దినపత్రిక నేడు
44వ వార్షికోత్సవం జరుపుకుంటున్న శుభ సందర్భంగా ప్రజాశక్తి
పాఠకులకు, యాజమాన్యానికి,
సిబ్బందికి, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు ఇవే
మా శుభాకాంక్షలు.
మండల ప్రజలకు,
అధికారులకు,
ప్రజాప్రతినిధులకు,
మిత్రులకు,
శ్రేయోభిలాషులకు
స్వాతంత్ర
దినోత్స శుభాకాంక్షలు...
నరసింహకుమార్
ఏపి రెవిన్యూ సర్వీసెస్ అసోసియేషన్
అన్నమయ్య జిల్లా ప్రెసిడెంట్,
అన్నమయ్య జిల్లా ఏపి జేఏసి ఛైర్మన్.
నవీన్
మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్,
పుల్లంపేట, అన్నమయ్య జిల్లా.


స్వాతంత్ర దినోత్సవ మరియు ప్రజాశక్తి
44వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
44వ
వార్షికోత్సవం
మండల ప్రజలకు, అధికారులకు,
ప్రజాప్రతినిధులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు...
నిజాలను నిర్భయంగా వ్రాసే పత్రిక
ప్రజాశక్తి దినపత్రిక నేడు 44వ వార్షికోత్సవం
జరుపుకుంటున్న శుభ సందర్భంగా ప్రజాశక్తి
పాఠకులకు, సిబ్బందికి, మిత్రులకు,
శ్రేయోభిలాషులకు ఇవే మా శుభాకాంక్షలు.
మల్లికార్జున
అగ్రికల్చర్ ఆఫీసర్, మరియు సిబ్బంది,
నందలూరు మండలం, అన్నమయ్య జిల్లా.